# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 12-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:269 పేజీలు:6 వెల: రూ.1/-


## ఆగస్టు 15వ తేదీ లోపు రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తాం

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులకు శుభవార్త అందించారు. రైతు రుణమాఫీపై ఆయన కీలక ప్రకటన చేశారు. ఆగస్టు 15వ తేదీ లోపు రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని రేవంత్ రెడ్డి మరోసారి రైతులకు ధీమా ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి ఇదేమాట చెబుతున్నానని, రైతులకు రుణమాఫీ పూర్తి చేసే వరకు ఇదే మాట మీద ఉంటానని ఆయన వెల్లడించారు. దీనిపై మరో రెండ్రోజుల్లో రుణమాఫీ విధి,విధానాలను ప్రకటించుతామని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం రైతు రుణమాఫీ అమలు కోసం అధికారులు మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. మార్గదర్శకాలు ప్రకటించిన వాటికి అనుగుణంగా అర్హుల జాబితాను సిద్ధం చేస్తామన్నారు. ఇక రైతుల రుణాలు మాఫీ చేయడానికి రోజులే మిగిలుందని రోజుల వ్యవధిలోనే ఇది జరిగిపోతుందని ఆయన తెలిపారు. అలాగే రుణమాఫీ కోసం 32 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో రూ. 10 వేల కోట్లను సిద్ధం చేశామని ఆయన ట్విట్టర్ వేదికగా తెలిపారు.

### చురక

విభజన హామీలకు
విశ్రాంతిక ఎన్నాళ్లు
రాజకీయ వివక్షల్లో
రాలుతున్న కన్నీళ్లు
కేంద్రంలో భాగస్వామ్య
కొలువుదీరినట్టి వాళ్లు
క్షమిస్తారా జనం ఇంకా
కట్టివేసుకుంటే నోళ్లు



-వేల్పుల నారాయణ
9440433475

# యువతకు జాబ్స్ రాకుండా కేటీఆర్, హరీశ్‌రావు కుట్ర - మంత్రి పొన్నం




హైదరాబాద్, జులై 11: :హైదరాబాద్: యువతకు జాబ్స్ రాకుండా చేయాలని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కుట్ర చేస్తున్నారని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

గురువారం గాంధీ భవన్ లో ఆయన మీడియా మాట్లాడారు. ప్రతి పక్షాల ఉచ్చులో పడొద్దని ఆయన సూచించారు. అభ్యర్థులు చదువుకోవాల్సిన సమయాన్ని వృధా చేసుకోవొద్దని కోరారు. మేధావుల అభిప్రాయం తీసుకొని త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన ఉంటుందన్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ ఆట కోసం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, హైదరాబాద్ ని మంత్రి కిషన్ రెడ్డి విమర్శిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రిగా ఉండి ఐదు ఏండ్లలో హైదరాబాద్ కు ఏం చేశారో, ఎన్ని నిధులు తెచ్చారో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు.

బీఆర్ఎస్, బీజేపీ లు మిత్ర పక్షంగా ఉండి హైదరాబాద్ ను ఆగం చేసింది వాస్తవం కాదా.. అని అన్నారు. అభివృద్ధిపై తమ మంత్రి వర్గంతో చర్చకు పిలిస్తే రాలేదని తెలిపారు. హైదరాబాద్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

## తమపై బురద చల్లడం ఆపి ఓటమిని సమీక్షించుకోవాలి

**– బీఆర్ఎస్ నేతలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచన**

హైదరాబాద్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బీఆర్ఎస్ నేతలు తమపై బురద చల్లడం ఆపి ఓటమిని సమీక్షించుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. అధికారం కోల్పోయి ఏడు నెలలైనా బీఆర్ఎస్ పెద్దలు ఇప్పటికీ భ్రమాలోకం నుంచి బయటకు రాలేకపోతున్నారని విమర్శించారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల భంగపాటు తర్వాత లోపం ఎక్కడుందో సమీక్షించుకోవాల్సింది పోయి ప్రభుత్వంపై బురద చల్లడంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. ఈరోజు(గురువారం) గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపితే స్వాగతిస్తామని తెలిపారు. నిస్పృహతో కూడిన ప్రకటనలతో గందరగోళాన్ని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రజయోజనం ఉండదని చెప్పారు.

# పోడు రైతులకూ సాయం - ఉప ముఖ్యమంత్రి భట్టి



ఆదిలాబాద్, జులై 11 : క్షేత్రస్థాయిలో రైతుల నుండి అభిప్రాయాలు సేకరించి పూర్తిస్థాయి మార్గదర్శకాలతో 'రైతుభరోసా' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో రైతు భరోసా విధివిధానాల ఖరారుపై ఉమ్మడి అదిలాబాద్ జిల్లా రైతుల నుండి అభిప్రాయాలు, సలహాలను క్యాబినెట్ సబ్ కమిటీ సేకరించింది. క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి దినసరి సీతక్క, శాసనసభ్యులు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో కీలకమైన రైతు భరోసా పథకాన్ని ప్రజాక్షేత్రంలో రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేసి తీరుతుంది అన్నారు. అన్ని జిల్లాల్లో క్యాబినెట్ సబ్ కమిటీ పర్యటించి ప్రజా క్షేత్రం లో అభిప్రాయాలు సేకరించి ఈ అసెంబీలో నివేదిక పొందుపరుస్తామని అన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం అందించే రైతు భరోసా పేద బడుగు వర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలని విజ్ఞప్తులు వస్తున్నాయని అన్నారు. రైతు భరోసా సాయం పై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు ఖరారు కాలేదని, గ్రామం యూనిట్గా తీసుకోవాలని రైతులు ఎక్కువమంది సూచిస్తున్నారని పేర్కొన్నారు. పోడు రైతులకు సర్కారు సాయంపై చర్చించి నిర్ణ నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

### బడా రైతులకు వద్దు.. 10 ఎకరాల పరిమితి విధించండి..

ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రాష్ట్ర ఆర్థిక భారం దృష్ట్యా పెద్ద రైతులకు పక్కనపెట్టి పేద, దళిత గిరిజన రైతులకు అందించాలని పలువురు రైతులు కోరారు. మెస్రం జంగు అనే గిరిజన రైతు మాట్లాడుతూ వర్షాధారంపైనే తాము పంట సాగు చేస్తున్నామని, ఖర్చులు పోను ఏమీ మిగడం లేదన్నారు. కౌలు రైతులకు కూడా సగం వంతు, మిగిలిన సగం ఆర్థిక సాయం పట్టా రైతులకు అందించాలని అన్నారు. వెనుకబడిన అదిలాబాద్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పది ఎకరాల సాగు చేసే రైతులందరికీ తప్పకుండా రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సర్కారు పంటల సాయం నిలుపుదల చేయాలని, రియల్ ఎస్టేట్ భూములు, సాగుకు పనికిరాని బీడు భూములకు కూడా పంటల పెట్టుబడి సాయాన్ని ఆపివేయాలని ప్రకాష్, గుణవంతు, అనే రైతులు కోరారు .

### ఫసల్ బీమా యోజన ప్రీమియం చెల్లించండి.. ఎమ్మెల్యే పాయల్ శంకర్

రైతులకు విపత్తు సమయనీ లో పరిహారం అందించే ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, రైతుల ప్రీమియం డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. బడా పారిశ్రామికవేత్తలకు, మూడు పంటలు సాగు చేసే పెద్ద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకుండా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పది ఎకరాలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా అమలు చేయాలని కోరారు.

బడ్జెట్లో 20% నిధులు ఆదిలాబాద్ కు కేటాయించాలి.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో 80 శాతం రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేసి నష్టపోతున్నారని, ఈ జిల్లాకు ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ అమలు చేయాలని అన్నారు. బడ్జెట్లో ఎక్కువ మొత్తం నిధులు ఖమ్మం జిల్లాకు వెళ్తున్నాయని చలోక్తిగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ముందు వరసలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా బడ్జెట్లో 20% నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు.

అనంతరం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ పథకం అమలులో రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకే ఉమ్మడి జిల్లాల సూచనలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు చెప్పారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ.. అన్ని వర్గాల రైతులను ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధు పథకంతో చేరువయ్యారని, ఈ పథకంలో ఆంక్షలు విధించవద్దని కోరారు.

### రైతులు, ప్రజల అభిప్రాయాల మేరకు విధివిధానాలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార మాట్లాడుతూ.. రైతులకు పంటల పెట్టుబడి

సాయం కింద రైతుభరోసా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామన్నారు. ఆ హామీ అమలుకు తమ ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రైతుభరోసా అమలుపై విధివిధానాల రూపకల్పన చేస్తామన్నారు. ఇందుకోసమే తమ ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి.. ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

### అర్హులకే రైతుభరోసా: తుమ్మల

క్యాబినెట్ సభ కమిటీ సభ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిజమైన రైతులకే రైతుభరోసా అందించేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ఆలోచనల మేరకు అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రైతుభరోసా అందిస్తామన్నారు.

### నిజమైన రైతులను ఆదుకుంటాం:పొంగులేటి

క్యాబినెట్ సబ్ కమిటీ మరో సభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిజమైన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. మరో 8 ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎంపీ గొడెం నగేష్ శాసనసభ్యులు అనిల్ జాదవ్, రామారావ్ పటేల్, హరీష్ రావు,వెడ్మ బొజ్జు , పెద్దపల్లి ఎంపీ వంశీ,జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మౌలిక వసతులు పెరగాలి - కిషన్ రెడ్డి

**-పెరుగుతున్న నగరానికి అనుగుణంగా మార్పు రావాలి**
**-ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు వేరే గా ఉన్నాయి**
**-ప్రధాని మోదీ 'ఏక్ పేడ్ మాకే నామ్' పిలుపు**
**-అమ్మపేరుతో మొక్క నాటిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**
**-వికసిత్ భారత్ దిశగా ప్రధాని మోదీ అడుగులు**



హైదరాబాద్, జులై 11: :ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన 'ఏక్ పేడ్ మాకే నామ్' పిలుపు మేరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఇవాళ బీజేపీ నగర కార్యాలయ ఆవరణలో వారి మాతృమూర్తి పేరిట ఓ మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఈ స్ఫూర్తితో మొక్కలు నాటుతూ అమ్మను గౌరవించుకోవాలని సూచించారు. ఓవైపు అమ్మకు గౌరవం కల్పిస్తూనే మరోవైపు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు..

అనంతరం ఆయన బిజెపి కేంద్ర కార్యాలయంలో వాసవి బృందావన్ సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పుడు ఎలాంటి సమయంలో నైనా సమస్యలు తీర్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం గత ప్రభుత్వం కూడా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసారని, ఆ అప్పులకు మిత్తులు కూడా కట్టలేని పరిస్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టి వేసాం న్నారు. కనీస అభివృద్ధి పనులు చేసెందుకు కాంట్రాక్టర్ లకు ఇవ్వడానికి కూడా డబ్బుకు లేవు టెండర్లు ఇవ్వలేక పోతున్నారని వాపోయారు.

### మౌలిక వసతులపైన దృష్టి పెట్టాలి

తెలంగాణ లో అత్యధిక శాతం ప్రజలు హైదరాబాద్ లోనే నివసిస్తున్నారు. మౌలికమైన వసతుల్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభు త్వం ఉందని, కానీ రాష్ట్ర ప్రభుత్వాలు వారి ప్రాధాన్యతల్ని మార్చుకుంటునా న్నయన్నారు. డిఫెనన్స్, ఐటీ, ఫార్మా, హెల్త్, లాంటి ప్రధానమైన రంగాలకు హైదరాబాద్ హబ్ గా ఉందని అంటూ ఆయా రంగాలకు పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తునన్ఫ్రాస్ట్రక్చర్ ప్రజల మౌలిక వస్తువుల కల్పనకు ప్రభుత్వాలకు కృషి చేయాలని తెలిపారు. ఇంఫ్రాస్ట్రక్చర్ను డెవలప్ చేసినప్పుడే ప్రజల స్థితిగతులు ఆర్థిక పరిస్థితులు పెరుగుతాయని, కానీ ఈ ప్రభుత్వానికి అవేం పట్టడం లేదన్నారు విమర్శించారు.

### వికసిత్ భారత్ దిశగా మోదీ అడుగులు ..

వికసిద్భారత్ లో భాగంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ను ఆవిష్కరించాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. పేదవాడి ఇంట్లో టాయిలెట్ నుంచి చంద్రయాన్ వరకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కూడా కేంద్రం కట్టుబటి ఉందన్నారు.. కానీ గత ప్రభుత్వం హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ అనే విదంగా వ్యవహరించిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి హైదరాబాద్ నగరం పై ఒక ప్రణాళికే లేదన్నారు . ప్రపంచంలోనే 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్ త్వరలో మూడో స్థానానికి ఎగబాకనుంది అ దిశగా మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## శ్రీశైలం ఫారెస్ట్‌లో జూదం ఆడుతున్న ముఠాపై కేసు.. రూ.1.21 లక్షల స్వాధీనం..!



అమరావతి, జులై 11 : శ్రీశైలంలోని గణేష్ సదన్ వెనకాల అడవిలో జూదం ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు వ్యక్తులు గుంపులుగా కూర్చుని డబ్బులతో జూదం ఆడుతున్నారు. ఈ సంగతి తెలియడంతో స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ జీ ప్రసాదరావు గురువారం తన సిబ్బంది రఘునాథుడు, అమర్నాథ్ రెడ్డి, మహేష్, నారాయణ, బాలకృష్ణ, శంకర్ సాయంతో 20 మంది వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరంతా శ్రీశైలం వాసులని ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపారు. వారి వద్ద నుంచి పేకలు, రూ. 1,21,190, ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు.

జూదం ఆడుతున్న వారిలో చంద్రగుంట్ల వెంకట లింగం, బోయపాటి మధు, కల్లూరి అనిల్, తెలుగు నాగలింగం, మూల మల్లారెడ్డి, చందమాల సురేష్ కుమార్, దూదేకుల కాశి, షేక్ నిరంజన్, దూదేకుల పెద్ద మూర్తుజావలి, జడ దొడ్డి సురేంద్ర, సయ్యద్ ముర్తుజావాలి, దంసాని శ్రీను, అంబపాటి జనార్ధన్ రెడ్డి, ప్రసాద్, నవీన్, ఐ మల్లి, చిన్న ముత్తు, నరేష్, నాగమల్లికార్జున, మల్లికార్జున నాయక్ ఉన్నారని పోలీసులు తెలిపారు.

### నేటి కందం - నేటికీ అందం

కావింపగ జలయానము
సేవింపగ బీదజనుల-క్షేమము నరయన్
ఆవిరి ఓడ దయానా
పావనముగ రూపుదాల్చె భరతావనిలోన్

(12-7-1823 భారత్ లో మొట్టమొదటి ఆవిరిఓడ నిర్మింపబడిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

## తిరుపతిలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

తిరుపతి, జులై 11 : తిరుపతి లో గురువారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం లో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. జిల్లాలోని బిఎన్ కండ్రిగ మండలం పార్లపల్లి వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒడిశా వాసులు బఫూన్‌ఖాన్(22), రాజాసింగ్(23), సుఖ్‌దేవ్ సింగ్(21) మృతి చెందారు. స్థానికంగా ఉన్న అట్టల పరిశ్రమలో పనిచేస్తున్న వీరు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేసి మృత దేహాలను ఆసుపత్రికి తరలించారు.

## జీవో 317పై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం

హైదరాబాద్, జులై 11: వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జీవో 317పై కేబినెట్ సమావేశమైంది. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సమావేశ ంలో పలు కీలక నిర్ణయాలను సబ్ కమిటీ ప్రకటించింది. సమావేశంలో స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య, భర్త చేసుకున్న దరఖాస్తులపై కమిటీ సానుకూల నిర్ణయం తీసుకుంది.

కేబినెట్ సబ్ కమిటీకి చేసుకున్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధిపతులకు పంపించా ల్సిందిగా జీఏడీ అధికారులకు సబ్ కమిటీ ఆదేశించింది. మిగతా దరఖాస్తులను వివిధ శాఖలకు పంపి వాటిని పరిశీలన చేసిన అనంతరం తిరిగి కేబినెట్ సబ్ కమిటీ దృష్టికి తీసుకురావాలని కమిటీ సమావేశంలో నిర్ణయించింది. కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ శివశంకర్, జీఏడీ అధికారులు పాల్గొన్నారు.

## పాకిస్తాన్‌కు చైనా నిషిద్ధమైన రసాయనాల రవాణా

**-తమిళనాడు రేవులో అధికారులు పట్టుకున్న అధికారులు**

చెన్నయ్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అంతర్జాతీయంగా నిషిద్ధమైన రసాయనాలను పాకిస్తాన్ కు చైనా రవాణా చేస్తుండగా తమిళనాడు రేవులో అధికారులు గురువారం పట్టుకున్నారు. పాకిస్తాన్ జీవ, రసాయన యుద్ధానికి తోడ్పడేందుకు చైనా ఈ సరకు రవాణా చేస్తోంది.సిఎస్ అని కూడా పిలువబడే ఆర్థో–క్లోరో బెంజిలిడిన్ మలోనోనిట్రైల్ సరుకును టియర్ గ్యాస్ , అల్లర్ల నియంత్రణకు ఉపయోగిస్తుంటారు. తమిళనాడులోని కట్టుపల్లి పోర్ట్ లో కస్టమ్స్ అధికారులు ఆ సరుకును అడ్డుకున్నారు.సిఎస్ అనేది అంతర్జాతీయ ఒప్పందాలు , భారతదేశ ఎగుమతి నియంత్రణ జాబితా క్రింద పేర్కొన్న ద్వంద్వ–వినియోగ రసాయనం(డ్యూయల్ యూజ్ కెమికల్). ఇది అల్లర్ల నియంత్రణకు ఉపయోగించడానికి వీలయినదప్పటికీ, స్వాధీనం చేసుకున్న భారీ పరిమాణం దాని సంభావ్యత సైనిక వినియోగంపై ఆందోళనలను కలిగిస్తోంది. 2560 కిలోల షిప్‌మెంట్ చైనా సంస్థ, చెంగ్డు షిచెన్ ట్రేడింగ్ కో. లిమిటెడ్ కు చెందింది, కానీ పాకిస్తాన్‌లోని రావల్పిండికి చెందిన రక్షణ సరఫరాదారు 'రోహైల్ ఎంటర్‌ప్రైజెస్'కు సరఫరా అవుతోంది. కానీ చెన్నైలో దీనిని స్వాధీనం చేసుకున్నారు.

# ఓయూలో పోలీసుల దాడిలో గాయపడ్డ బీఆర్‌ఎస్వీ నాయకులను కలిసిన కేటీఆర్



హైదరాబాద్, జులై 11: : తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్వీ నాయకులు పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ గత కొద్ది రోజుల నుంచి బీఆర్ఎస్వీ నాయకులు తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. ఇక వారం పది రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోన్న నిరుద్యోగుల ఆందోళనల్లోనూ బీఆర్ఎస్వీ నాయకులు పాలుపంచుకున్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరేవర్చాలని డిమాండ్ చేసన్తూ టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేశారు. ఇక డీఎస్సీని వాయిదా వేయాలంటూ గత వారం రోజుల నుంచి డీఎస్సీ అభ్యర్థులు ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఉద్యమిస్తున్నారు. డీఎస్సీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద బీఆర్ఎస్వీ నాయకులు నిన్న శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు.

అయితే బీఆర్ఎస్వీ నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు చుట్టుముట్టి విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో విద్యార్థి నాయకులు గాయపడ్డారు. పోలీసుల తీరును బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.

ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. నిన్న పోలీసుల దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్వీ నాయకులను నందినగర్‌లో కలిశారు. వారి పోరాట పటిమను ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ పోరాట పటిమను అనేక సందర్భాల్లో చూపించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ ఫిరాయింపులకు పాల్పడినప్పుడు, గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 పిలవాలని, డీఎస్సీ వాయిదా వేయాలని మీరు నిరసనలు చేపట్టారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతూనే ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎల్లప్పుడూ పార్టీ అగ్ర నాయకత్వం బీఆర్ఎస్వీ నాయకులకు అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## ఈనెల 24 నుంచి తెలంగాణా అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈనెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. సమావేశాల నిర్వహణపై ఈరోజు (గురువారం) అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అసెంబ్లీలో రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్‌లు రామచంద్రనాయక్, ఆది శ్రీనివాస్, సీఏస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు

# 'జీవనశైలి' రుగ్మత వలయంలో యువభారతం !

ప్రతి ముగ్గురిలో ఒక్క భారతీయ యువకుడు, అనగా 33.3 శాతం మంది ప్రమాదకర 'మెటబాలిక్ సిండ్రోమ్ (జీవ క్రియ బహువ్యాధి లక్షణం/జీవనశైలి రుగ్మతలు)' విష వలలో చిక్కుతున్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు. 'సిట్టింగ్ ఈజ్ కిల్లింగ్' అనే నినాదం నేడు బహుళ ప్రచారం పొందుతున్నది. గంటల తరబడి కూర్చొని పని చేస్తున్న వ్యక్తులు సమీప భవిష్యత్తులో మెటబాలిక్ రుగ్మతల బారిన పడతారని తెలుస్తున్నది. ఉద్యోగ ఉపాధుల రీత్యా నిశ్చలమైన జీవనశైలి (సెడెంటరీ లైఫ్ స్టైల్)కి అలవాటు పడిన 30 – 39 ఏండ్ల వయస్సు కలిగిన భారతీయ యువత ఉదర ఊబకాయం లేదా అబ్డమినల్ ఒబేసిటీ లేదా బొర్ర పెరగడం అనే రుగ్మతతో పాటు ఇన్సులిన్ నిరోధకత, బిపీ, టైప్-2 మధుమేహం, హైపర్‌లిపిడెమియా, హై బ్లడ్ ట్రైగ్లిజరైడ్స్, లో లెవల్ హెచ్‌డిఎల్ కొలెస్టరాల్ లాంటి 'మెటబాలిక్ సిండ్రోమ్' అనబడే అనారోగ్యాల బారిన పడి ప్రమాదకర హృద్రోగాల పాలు అవుతున్నారని నిపుణులు వివరిస్తున్నారు.

## ఆధునిక జీవనశైలి రుగ్మతలు:

కదలకుండా గంటల తరబడి కూర్చొని పని చేస్తున్న సాఫ్ట్‌వేర్, ఆఫీస్ ఉద్యోగుల్లో ఫ్యాటీ లివర్, డిస్‌లిపిడెమియా, స్థూలకాయం, బీపీ, షుగర్, నడుం చుట్టు/పొట్టలో అధిక కొవ్వు పేరుకు పోవడం లాంటి అనారోగ్యాలకు గురి అవుతున్నారని వైద్యులు సూచిస్తున్నారు. నిశ్చల జీవన విధానాన్ని పాటిస్తున్న యువతలో 25 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత మెటబాలిక్ సిండ్రోమ్ రుగ్మతలు తమ ప్రకూల ప్రభావాలను చూపుతూ గుండె జబ్బులకు సహితం కారణం అవుతున్నారు. భారతీయ యువతలో దాదాపు 25 శాతం (మహిళల్లో 31 శాతం, పురుషుల్లో 18.5 శాతం) మెటబాలిక్ సిండ్రోమ్‌కు కారణాలు:

పాండుచ్చేరికి చెందిన జిప్మర్ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో 1.33 లక్షల మంది పౌరుల ఆరోగ్య ప్రగతిని విశ్లేషించి ఫలితాలను రాబట్టారు. 50 ఏండ్లు దాటిన భారతీయుల్లో 50 శాతం వరకు ఈ రుగ్మతలకు లోనవుతున్నట్లు తేలింది. పట్టణ యువతతో పోల్చితే గ్రామీణ యువతలో తక్కువగా కనిపిస్తున్నట్లు తేల్చారు. శారీరక శ్రమ లేదా వ్యాయామం కొరవడడం, బయటి పనులు తగ్గిపోవడం, మైదాన ఆటలకు స్వస్తి పలకడం, మానసిక ఒత్తిడి బారిన పడడం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు లాంటి కారణాలతో మెటబాలిక్ సిండ్రోమ్ రుగ్మతలకు దగ్గరవుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. కనీసం 6 – 7 ఏండ్ల పాటు నిశ్చల జీవనశైలినా పాటిస్తున్న యువతలో ఈ రుగ్మతలు బయట పడుతున్నాయని తెలుపుతున్నారు. నభారతీయుల్లో 30 –40 శాతం వరకు మెటబాలిక్ సిండ్రోమ్ రుగ్మతలు కనిపిస్తున్నాయి.

## మెటబాలిక్ సిండ్రోమ్ కట్టడి మార్గాలు:

1960ల్లో రోజుకు రెండు పూటల మాత్రమే ఆహారం తీసుకునే అలవాటు ఉండేది. గతంతో పోల్చితే నేటి పట్టణ యువత 7 రెట్లు అధికంగా ఆహారం తింటున్నారని వివరిస్తున్నారు. ప్రతి వ్యక్తి.

20 – 30 ఏండ్ల వయస్సులో పాటించిన జీవనశైలి, ఆహార అలవాట్లు 30 దాటిన తర్వాత తమ ప్రభావాన్ని చూపుతాయని వైద్యులు అంటున్నారు. గ్లుకోజ్ అధికంగా ఉన్న ఆహారాలను నియంత్రించుకోవడం, శారీరక వ్యాయామానికి ప్రాధాన్యమివ్వడం, ఫాస్ట్/ప్యాకెజ్డ్/ప్రాసెస్డ్ ఫుడ్స్‌కు చరమగీతం పాడడం, గంటల తరబడి కూర్చొని పని చేయడాన్ని తగ్గించడం, ప్రతి గంట లేదా గంటన్నర తర్వాత ఐదు నిమిషాలు లేచి నడవడం, దినచర్యను క్రమబద్ధీకరించుకోవడం, పిండి పదార్థాలను తగ్గించి మాంసకృత్తులు/పీచు పదార్థాలను అధికంగా తీసుకోవడం, ఆల్కహాల్/స్మోకింగ్/ఫ్యాటీ ఫుడ్/నూనెలో వేయించిన ఆహారాలను వదిలేయడం, పరిమిత కాలం పాటు నిద్రించడం, నిత్యం (యోగా/ధ్యానం/వాకింగ్/రన్నింగ్/అవుట్‌డోర్ గేమ్స్/ట్రెడ్‌మిల్/సైక్లింగ్) శారీరక వ్యాయామాలు చేయడం లాంటి జీవన విధానాలు 'మెటబాలిక్ సిండ్రోమ్' బారిన పడకుండా రక్షిస్తాయి. బిఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) శాతం 40 దాటిన రోగులకు బెరియాట్రిక్ సర్జరీ కూడా చేయడం చూస్తున్నాం.

చేతులు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకున్నట్లు, ఆరోగ్యంగా ఉన్నప్పుడే భవిష్యత్తు ఆరోగ్యానికి బాటలు వేస్తూ, సంపూర్ణ ఆరోగ్య దీపం ఉండగానే భవిష్యత్తు ఆరోగ్య ఇల్లును సక్కబెట్టుకుంటూ, సక్రమ జీవనశైలిని పాటిస్తూ మన ఆరోగ్యాలను కాపాడుకుందాం, ఆరోగ్యమే సౌభాగ్యమని నినాదాలు చేద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037



హైదరాబాద్, జులై 11: :ప్రముఖ బాలసాహితీవేత్త , కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన తప్పెవరిది? బాలకథాసంపుటి ఆవిష్కరించిన జట్టు వ్యవస్థాపకుడు, కళారత్న డా. డి. పారినాయుడు. చిత్రంలో ఎడమ నుండి వరుసగా వ్యవసాయ వాచకాల రచయితలు, కవులు సర్వశ్రీ పక్కి రవీంద్రనాథ్, అల్లువాడ కైలాసరావు , రౌతు వాసుదేవరావు, చిత్రకారుడు తుంబలి శివాజీ, పుస్తక ఆవిష్కర్త పారినాయుడు, పుస్తక రచయిత నారంశెట్టి, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు, టి. శివకేశవరావు, బాలసాహితీవేత్త బెహరా ఉమామహేశ్వరరావు, పెంకి గౌరీశ్వరరావు ఉన్నారు.

# వ్యక్తి దేహ దారుఢ్యానికి, మానసికోల్లాసానికి యోగా సర్వరోగ నివారిణి

## -ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



వరంగల్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్); హనుమకొండ "శ్రీ రామకృష్ణ సేవా సమితి భవన్"లో బుధవారం యోగా శిక్షణ శిబిరాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి–నీలిమా దంపతులు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యోగా గురువు రవీంద్రాచారి నిర్వహణలో జరిగిన యోగా శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి "యోగా" ను తన జీవితంలో నిత్యకృత్యంగా ఆచరించాలని తద్వారా తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, మానసిక వికాసాన్ని పొందడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత సేవా సమితి గ్రంథాలయాన్ని సందర్శించి అవసరమైన భగవద్గీత, రామాయణ –భాగవతాది ఆధ్యాత్మిక గ్రంథాలను, పుస్తకాలను సమకూర్చుతా నన్నారు. సేవా సమితి అధ్యక్షులు కటంగూరు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ శ్రీ రామకృష్ణ సేవా సమితి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను సమాజం ఆచరింప జేయుటలో, యువతను సత్శీలురుగా తీర్చి దిద్దుటలో, ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని కల్పించుటలో అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సమితి కార్యక్రమాలయెడ సదవగాహన కలిగిన పెద్దలు, భక్తులు, కార్యకర్తల సహాయసహకారాలతో ఇప్పటికి సుమారు కోటిన్నర వ్యయంతో ఈ స్థితిలో నున్న భవనంయొక్క నాలుగు స్లాబులు పూర్తయినవి. పూర్వ వరంగల్ జిల్లాకు ఇదొక పర్యాటక దివ్య మందిరంగా బాసిల్లుతుందన్నారు. తర్వాత 59వ డివిజన్ మునిసిపల్ కార్పొరేటర్ గుజ్జుల వసంత–మహేందర్ రెడ్డిలు విశిష్ట అతిథులుగా హాజరవడం హర్షణీయం. సేవా సమితి బాధ్యులు, భక్తులు, కార్యకర్తలు, శ్రీనివాస స్వామి, జినుగు విష్ణువర్ధన్ రెడ్డి, సూర్య, కవి రావు, నవీన్ రెడ్డి, అశోక్ రెడ్డి, బ్రహ్మానందం, వెంకన్న, వేణుగోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అంజనీదేవి, మూల సరోజన, అనిత, పార్వతి, వీణ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ సవరించిన వడ్డీ ప్రకారమే ఫైనల్ సెటిల్‌మెంట్.. ఈపీఎఫ్ఓ వెల్లడి

న్యూఢిల్లీ, జులై 11 : వివిధ సంస్థల్లో పని చేస్తూ ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) లో సబ్‌స్క్రైబర్లుగా ఉన్న వారికి కీలక అప్‌డేట్ అందించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్ నిల్వలపై 8.25 శాతం వడ్డీ చెల్లిస్తామని తెలిపింది. 2023–24 మధ్యలో గానీ, 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో గానీ ఫైనల్ సెటిల్మెంట్ చేసుకున్న తమ సబ్ స్క్రైబర్లకు సవరించిన వడ్డీ ప్రకారమే చెల్లింపులు జరుపుతామని 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా తెలిపింది.

సాధారణంగా ఈపీఎఫ్ నిల్వలపై వడ్డీరేటును ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత త్రైమాసికంలో ఖరారు చేస్తారు. తదనుగుణంగానే 2023–24 ఆర్థిక సంవత్సర వడ్డీరేటును గత మే నెలలో ఖరారు చేశామని ఈపీఎఫ్ఓ పేర్కొంది. ఇటీవలి కాలంలో ఇదే అత్యధికం అని వివరించింది. స్మాల్ సేవింగ్ స్కీమ్స్, జీపీఎఫ్, పీపీఎఫ్ వంటి పథకాలపై వడ్డీరేట్లకంటే ఈపీఎఫ్ నిల్వలపై వడ్డీరేటు అధికం అని వెల్లడించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్ నిల్వలపై 8.15 శాతం వడ్డీని కేంద్రం నిర్ణయించింది.

గత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నోటిపై చేసిన వడ్డీరేటు ప్రయోజనాలు అందరికీ అందాలన్న ఉద్దేశంతో ఫైనల్ సెటిల్మెంట్లు చేసుకుంటున్న సభ్యులందరికీ అదే వడ్డీ చెల్లిస్తున్నట్లు ఈపీఎఫ్ఓ వెల్లడించింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఖాతాదారులకు త్వరలోనే అదే వడ్డీరేటు అందుతుందని తెలిపింది. అయితే, ఎప్పుడు పీఎఫ్ ఖాతాల్లో జమ అవుతుందన్న సంగతి మాత్రం వెల్లడించలేదు.

# అస్సాంలో వరద బీభత్సం.. 92కు పెరిగిన మృతుల సంఖ్య

అస్సాం జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అస్సాంలో వరద బీభత్సం కొనసాగుతోంది. ఈ వరదలు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు రాష్ట్రంలోని అన్ని నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహించాయి. అయితే, ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రధాన నదులు, వాటి ఉపనదుల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17.70 లక్షల మంది వరదలకు తీవ్ర ప్రభావితులయ్యారు. వరదల కారణంగా నిన్న ఒక్కరోజే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అస్సాం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం.. మంగళవారం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కాచర్‌లో ఇద్దరు మరణించగా.. ధుబ్రి, ధేమాజీ, సౌత్ సల్మారా, నాగావ్, శివసాగర్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది వరదలు, కొండ చరియలు విరిగిపడటం, తుపానుల కారణంగా రాష్ట్రంలో మృతి చెందిన వారి సంఖ్య 92కు పెరిగింది. అందులో ఒక్క వరదల కారణంగానే 79 మంది ప్రాణాలు కోల్పోయారు.

వరదలకు 17.70 లక్షల మంది ప్రభావితం..

వరదల కారణంగా శుక్రవారం నాటికి 27 జిల్లాల్లో 18.80 లక్షల మంది ప్రభావితం కాగా.. మంగళవారం నాటికి ఆ సంఖ్య 17.70 లక్షలకు తగ్గింది. 38,870.3 హెక్టార్ల సాగు భూములు ముంపునకు గురయ్యాయి. 3,54,045 జనాభా కలిగిన ధుబ్రి జిల్లా ఈ వరదలకు తీవ్రంగా ప్రభావితమైంది. ఆ తర్వాత కాచర్ (1,81,545 మంది జనాభా), శివసాగర్ (1,36,547), బార్‌పేట (1,16,074), గోలాఘాట్ (1,09,475) వరద ప్రభావానికి గురైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 48,021 మంది బాధితులు 507 సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. సుమారు 1,04,665 మందికి అధికారులు సహాయక సామగ్రిని అందించారు.

కజిరంగా పార్క్‌లో 159 వన్యప్రాణులు మృత్యువాత

ప్రఖ్యాత కజిరంగా నేషనల్ పార్క్ (ఐజీళితీజీనిఐజీ ఔజీబితినీనిజీశ్రీ ఖజీతీఎ)ను ఇటీవలే కాలంలో ఎన్నడూ లేనివిధంగా వరదలు ముంచెత్తాయి. దీంతో మొత్తం 159 వన్యప్రాణులు మరణించాయి. 20 జంతువులు వరదలో కొట్టుకుపోయాయి. సుమారు 133 జంతువులను అధికారులు రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ వరదలకు రాష్ట్రంలో 13,66,829 జంతువులు ప్రభావితమయ్యాయి. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 94 రోడ్లు పూర్తిగా దెబ్బతినగా.. మూడు వంతెనలు కొట్టుకుపోయాయి. 26 ఇళ్లు, ఆరు కట్టలు కూడా దెబ్బతిన్నాయి. ఇక నిమతిఘాట్, తేజ్‌పూర్, గౌహతి, ధుబ్రి వద్ద బ్రహ్మపుత్ర నది ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తోంది.

# నిజమైన రైతులకే రైతుభరోసా అందాలి : మంత్రి తుమ్మల




ఖమ్మం న జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )?జమైన రైతులకే రైతు భరోసా అందాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా నుంచి రైతుభరోసా సదస్సులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్‌లో రైతుభరోసా విధివిధానాలపై అభిప్రాయాల సేకరించినట్లు తెలిపారు. ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అభిప్రాయాలు సేకరణ జరిగిందని వెల్లడించారు .ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వం ముందుకెళ్తుందని తుమ్మల అన్నారు. గతంలో జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులకు చేయూత నిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు.

# ముస్లిం మహిళలు విడాకుల తర్వాత భర్త నుండి భరణం పొందవచ్చు

న్యూఢిల్లీ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ముస్లిం మహిళలు విడాకుల తర్వాత భర్త నుండి భరణం పొందవచ్చని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెల్లడించింది. భార్య భరణ హక్కుకు సంబంధించిన కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 125 ప్రకారం ముస్లిం మహిళలు తమ భర్తల నుంచి భరణం పొందవచ్చని సుప్రీంకోర్టు బుధవారం తీర్పునిచ్చింది. న్యాయమూర్తులు బివి నాగరత్న, అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం.. భార్యకు భరణం పొందే చట్టబద్ధమైన హక్కును సూచించే పాత అతీఖఅలోని సెక్షన్ 125 ముస్లిం మహిళలకు కూడా వర్తిస్తుందని పేర్కొంది. భరణం అనేది దాతృత్వం కాదని, వివాహిత మహిళల హక్కు అని, వారి మతంతో సంబంధం లేకుండా వివాహిత మహిళలందరికీ వర్తిస్తుందని బెంచ్ నొక్కి చెప్పింది. ఫ్యామిలీ కోర్టు మెయింటెనెన్స్ ఆర్డర్‌లో జోక్యం చేసుకోకూడదన్న తెలంగాణ హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేసిన మహ్మద్ అబ్దుల్ సమద్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళకు అతీఖఅలోని సెక్షన్ 125 కింద భరణం పొందే అర్హత లేదని, బదులుగా ముస్లిం మహిళల (విడాకుల హక్కుల రక్షణ) చట్టం, 1986 ప్రకారం ఉపశమనం పొందాలని సమద్ వాదించారు. "సెక్షన్ 125 పెళ్లయిన మహిళలకు మాత్రమే కాకుండా మహిళలందరికీ వర్తిస్తుందని.. ఈ క్రిమినల్ అప్పీల్‌ను తోసిపుచ్చుతున్నాం" అని తీర్పును ప్రకటిస్తూ జస్టిస్ నాగరత్న అన్నారు.

# దూరండ్ కప్ ఆటల పోటీ ట్రోఫీలను ఆవిష్కరించిన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జులై 11 :భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము దూరండ్ కప్ టోర్నమెంట్ 2024 కు సంబంధించిన ట్రోఫీలను రాష్ట్రపతి భవన్, సాంస్కృతిక కేంద్రంలో ఈ రోజున (అంటే 2024 జులై 10వ తేదీన) జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దూరండ్ కప్ ను, ప్రెసిడెంట్స్ కప్ ను, సిమ్లా ట్రోఫీ ని ఆవిష్కరించారు.

రాష్ట్రపతి ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ప్రపంచంలో ప్రజాదరణ అమితం గా ఉన్న క్రీడలలో ఫుట్ బాల్ ఒకటి అన్నారు. వృత్తి నైపుణ్యం కలిగిన ఫుట్ బాల్ క్రీడాకారులు వేల కొద్దీ అభిమానుల సమక్షంలో ఆడుతూ ఉన్నప్పుడు ఇటు ప్రేక్షకులలోను, అటు ఆటగాళ్ళలోను ఉత్తేజం అనేక రెట్లు పెరిగిపోతుందని రాష్ట్రపతి అన్నారు.

దూరండ్ కప్ టోర్నమెంట్ 2024 లో పాలుపంచుకొనే క్రీడాకారులందరికీ రాష్ట్రపతి శుభాకాంక్షలను తెలియజేశారు. ఆటగాళ్ళు వారు గెలిచినా, లేదా ఓడినా క్రీడలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, ఇతర జట్లను క్రీడాకారులు గౌరవించాలని రాష్ట్రపతి అన్నారు. ఆటలో కొన్ని సందర్భాల లో ఆవేశం, ఉద్వేగం తలెత్తుతాయి, అయితే ఆటగాళ్ళు వారి భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించాలని, ఆటలో వారి అత్యున్నత ప్రతిభ ను కనబరచడానికి ప్రయత్నించాలని ఆమె అన్నారు. ఆటగాళ్ళు అందరు దృఢ సంకల్పంతో, క్రీడా స్ఫూర్తిని చాటుతారన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.

# ఉన్నావ్ లో జరిగిన రహదారి ప్రమాదం పట్ల తీవ్ర దుఃఖాన్ని వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 11 :ఉన్నావ్ లో జరిగిన రహదారి దుర్ఘటన పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజున తీవ్ర దుఃఖాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో స్థానిక పరిపాలన యంత్రాంగం బాధితులకు చేతనైన అన్ని విధాలుగాను సహాయం చేయడంలో నిమగ్నం అయిందంటూ ఆయన హామీని ఇచ్చారు.

"ఉత్తర్ ప్రదేశ్ లోని ఉన్నావ్ లో జరిగిన రహదారి దుర్ఘటన అత్యంత బాధాకరమైంది. ఈ దుర్ఘటనలో ఆప్తులను కోల్పోయిన వ్యక్తులకు ఇదే నా సంతాపం. వారికి ఈ కఠిన కాలంలో ఓర్పుగా ఉండే శక్తిని ఆ ఈశ్వరుడు ప్రసాదించు గాక. ఈ దుర్ఘటనలో గాయపడ్డ వ్యక్తులు త్వరగా పునఃస్వస్థులు అవ్వాలని కోరుకుంటున్నాను. రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణలో స్థానిక పాలన యంత్రాంగం బాధితులకు అన్ని విధాలుగాను సహాయం చేయడంలో నిమగ్నమైంది: ప్రధాన మంత్రి శ్రీ@narendramodi" అని తెలిపింది.

ఉన్నావ్ లో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలను కోల్పోయిన వ్యక్తుల దగ్గరి సంబంధికులకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుండి 2 లక్షల రూపాయల వంతున పరిహారాన్ని కూడా శ్రీ నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డ వారికి 50,000 రూపాయల వంతున పరిహారాన్ని ఇవ్వడం జరుగుతుంది."ఉన్నావ్ దుర్ఘటనలో మరణించిన ప్రతి వ్యక్తి కి ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుంచి 2 లక్షల రూపాయల వంతున పరిహారాన్ని వారి దగ్గరి బంధువులకు చెల్లించడం జరుగుతుందని ప్రధాన మంత్రి ప్రకటించారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డ వ్యక్తులకు 50,000 రూపాయల వంతున ఇవ్వడం జరుగుతుంది" అని తెలిపింది.

# ఏపీలో 19మంది ఐఏఎస్ , ఇద్దరు ఐపీఎస్ లు బదిలీ..

అమరావతి, జులై 11 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 19 మంది ఐఏఎస్ లు బదిలీ అయ్యారు. వారితో పాటు ఇద్దరు ఐపిఎస్ లను కూడా బదిలీ చేశారు. విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ డిజిగా ఐపిఎస్ హరీష్ కుమార్ గుప్తా , హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా ఐపిఎస్ కుమార్ విశ్వజీత్ ను నియమించారు.. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అటవీశాఖ స్పెషల్ సీఎస్‌గా అనంతరాము, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్‌గా రాం ప్రకాష్ సిసోడియాకు బాధ్యతలు అప్పగించారు. భూ పరిపాలన చీఫ్ కమిషనర్‌గా జయలక్ష్మి, కన్నబాబుకు సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు.

# ఎన్ సి ఇ ఆర్ టీ పాఠ్య పుస్తకాలపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వార్తా కథనంపై వివరణ

న్యూఢిల్లీ, జులై 11 :ఆరు, తొమ్మిది, 11 తరగతులకు సంబంధించి సవరించిన పాఠ్యపుస్తకాలపై కొనసాగుతున్న గందరగోళంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన అంటూ 9 జులై 2024 హిందూ దినపత్రికలో వచ్చిన వార్తా కథనం వాస్తవ విరుద్ధంగా వుంది.ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది.

ఎన్ సి ఆర్ టివారి ఆరో తరగతి పాఠ్యపుస్తకాలు విద్యార్థుల చేతుల్లోకి రావాలంటే మరో రెండు నెలల సమయం పడుతుంది. కేవలం 3, 6 తరగతుల పాఠ్యపుస్తకాలనే సవరిస్తారా , వీటికి తోడుగా 9, 11 తరగతుల పాఠ్యపుస్తకాలను కూడా సవరిస్తారా అనేదానిపై సిబిఎస్ ఇ సరిగా సమాచారం అందించలేదు. 9వ తరగతి ఇంగ్లీష్, భౌగోళికశాస్త్రం, 11వ తరగతి కంప్యూటర్ సైన్స్, రసాయనశాస్త్రం, చరిత్ర పాఠ్యపుస్తకాలు ప్రచురితం కాలేదు.

అనుమానాలను తొలగించడానికి, సంపూర్ణమైన స్పష్టత ఇవ్వడానికిగాను ఎన్ సి ఆర్ టి ఇచ్చిన వివరణ:

జులై 2024లోనో ఆరో తరగతి పాఠ్యపుస్తకాలన్నిటిని ఎన్ సి ఆర్ టి అందుబాటులోకి తేనున్నది. వార్తాకథనంలో ఇచ్చిన 2 నెలల సమయం పడుతుందనేది అవాస్తవం. ప్రయోగాత్మక బోధన భావనల కింద ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగినంత సమయం ఇచ్చి వారిలో సొంత అనుభవాలు కలిగేలా ఎన్ సి ఇ ఆర్ టి ఒక నెలపాటు బ్రిడ్జి కార్యక్రమాన్ని 6వ తరగతి పది పాఠ్యపుస్తకాలన్నిటిలో నిర్వహించింది. అంతే కాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాత పాఠ్య ప్రణాళికనుంచి నూతన పాఠ్యప్రణాళికకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా మారేందుకు ఈ బ్రిడ్జి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని ప్రస్తుతం బోధనకు ఉపయోగించడం జరుగుతోంది.

మార్చి 22 , 2024 తేదీన వెలువడిన సిబిఎస్ ఇ సర్క్యులర్ నెంబర్ అకాడమిక్ 29 /2024 ప్రకారం 3, 6 తరగతులను మినహాస్తే ప్రస్తుతమున్న పాఠ్యప్రణాళికలోను, పాఠ్యపుస్తకాల్లోను ఎలాంటి మార్పు లేదని తెలియజేయడం జరిగింది. తప్పుదోవ పట్టించే సమాచారం వెలువడిన నేపథ్యంలో దాన్ని నమ్మవద్దని 3, 6 తరగతులను మినహాయిస్తే ఇతర తరగతులకు సంబంధించి గత విద్యాసంవత్సరం అంటే 2023–24లో ఉపయోగించిన పాఠ్యపుస్తకాలనే ఉపయోగించాలని ఉపాధ్యాయులకు సూచించడం జరిగింది.

# వసతి గృహం మూడో అంతస్తు నుండి దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ లోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థి పురుగులు మందు తాగి అనంతరం భవనం పైనుంచి కిందకు దూకాడు. బుధవారం మధ్యాహ్నం మూడో సంవత్సరం చదివే హరినాథ్ అనే విద్యార్థి పురుగుల మందు తాగి తరువాత వసతి గృహం మూడో అంతస్తు నుండి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. హాస్టల్ బిల్డింగ్ మీది నుంచి దూకుతుండగా విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడి స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఏమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వ్యవసాయ రంగాన్ని కాపాడుకుంటాం: భట్టి

ఖమ్మం జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రైతు భరోసా పథకం అమలు కోసం ఉమ్మడి పది జిల్లాల రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఖమ్మం లో జరిగిన రైతు భరోసా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం లో భట్టి ప్రసంగించారు. రైతు భరోసా విధానాలు రూపొందించిన తరువాత రైతులకు సాయం చేయస్తా మన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్రం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశం పెట్టలేదని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందని వివరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని భట్టి స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, రైతులకు రుణమాఫీ కూడా చేస్తామని భట్టి చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో రైతు భరోసా పథకం పై ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులతో విస్తృత సాయి సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# భారత-ఆస్ట్రియా విస్తృత భాగస్వామ్యంపై ఉమ్మడి ప్రకటన

న్యూఢిల్లీ, జులై 11 :ఆస్ట్రియా చాన్సలర్ కార్ల్ నెహామర్ ఆహ్వానాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2024 జూలై 9-10 తేదీల్లో ఆ దేశంలో అధికారికంగా పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన ఆస్ట్రియా అధ్యక్షుడు మాననీయ అలెగ్జాండర్ వాన్ డెర్ బెల్లెన్ ను కలవడంతో పాటు చాన్సలర్ నెహామర్ తో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ఇది ఆస్ట్రియాలో ప్రధానమంత్రి తొలి పర్యటన మాత్రమే కాదు, 41 సంవత్సరాల కాలంలో భారతదేశ ప్రధానమంత్రి ఒకరు ఆస్ట్రియాలో పర్యటించడం ఇదే ప్రథమం. అంతే కాదు, 2024 సంవత్సరం ఉభయదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడిన 75వ సంవత్సరం కావడం విశేషం.

భాగస్వామ్య ప్రజాస్వామిక విలువలు, స్వేచ్ఛ, అంతర్జాతీయ శాంతి సుస్థిరతలు, ఐక్యరాజ్య సమితి చార్టర్ లో పొందుపరిచిన నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థ ఉభయ దేశాల విస్తృత భాగస్వామ్యంలో కీలకమైన అంశాలని ప్రధానమంత్రి, చాన్సలర్ నొక్కి వక్కాణించారు. అంతే కాదు ఉభయ దేశాల మధ్య నెలకొన్న దీర్ఘకాలిక బంధం కూడా ఇందుకు కీలకమని అభిప్రాయపడ్డారు. మరింత సుస్థిరమైన, సుసంపన్నమైన, సుస్థిర ప్రపంచం కోసం ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారం మరింత లోతుగా విస్తరించుకునేందుకు కృషిని కొనసాగించాలన్న కట్టుబాటును పునరుద్ఘాటించారు.

ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత శ్రేణికి పెంచుకోగల సామర్థ్యం ఉభయ దేశాలకు ఉన్నదని చాన్సలర్ నెహామర్, ప్రధానమంత్రి శ్రీ మోదీ గుర్తించారు. ఈ భాగస్వామ్య లక్ష్యాన్ని మరింత ముందుకు నడిపించేందుకు వ్యూహాత్మక వైఖరి అనుసరించాలని అంగీకారానికి వచ్చారు. ఈ లక్ష్యసాధన కోసం సన్నిహిత రాజకీయ చర్చలతో పాటు భవిష్యత్ దృక్పథంతో కూడిన సుస్థిర ఆర్థిక, సాంకేతిక ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవాలని వారు నిర్ణయించారు. అనేక నూతన కార్యక్రమాలు, ఉమ్మడి ప్రాజెక్టులు, ఉమ్మడి టెక్నాలజీల అభివృద్ధి; పరిశోధన, నవకల్పనలు; హరిత, డిజిటల్ టెక్నాలజీలు, మౌలిక వసతులు, పునరుత్పాదక ఇంధనం, జలవనరుల నిర్వహణ, లైఫ్ సైన్సులు, స్మార్ట్ సిటీలు, మొబిలిటీ, రవాణా రంగాల్లో వ్యాపార భాగస్వామ్యాలు నెలకొల్పుకోవడం ఇందులో కీలకమని గుర్తించారు.

అంతర్జాతీయ, ప్రాంతీయ శాంతి సుస్థిరతల స్థాపనలో తమ వంతు వాటా అందించేందుకు ఇండియా, ఆస్ట్రియా వంటి ప్రజాస్వామ్య దేశాలు కలిసికట్టుగా పని చేయాల్సిన ఆవశ్యకత ఉన్నదని ప్రధానమంత్రి శ్రీ మోదీ, చాన్సలర్ నెహామర్ నొక్కి చెప్పారు. ఈ ప్రయత్నంలో భాగంగా ఇటీవల ఉభయ దేశాల విదేశాంగ మంత్రుల స్థాయిలో నిర్దిష్ట కాలపరిమితిలో, నిర్మాణాత్మకంగా జరుగుతున్న సంప్రదింపుల పట్ల నాయకులిద్దరూ సంతృప్తి ప్రకటించారు. ఈ చర్చలను విభిన్న రంగాలకు విస్తరిస్తున్న ప్రస్తుత ధోరణిని కొనసాగించాలని వారు తమ అధికారులను ప్రోత్సహించారు.

సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతల పట్ల పూర్తి గౌరవభావంతో వ్యవహరిస్తూ ఐక్య రాజ్య సమితి సాగర జలాల నిబంధనావళిలో (యుఎన్ సిఎల్ఓఎస్) పొందుపరిచిన అంతర్జాతీయ సాగర న్యాయ చట్టాలకు లోబడి ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛాయుత, బహిరంగ, నిబంధనల ఆధారిత మండలంగా తీర్చి దిద్దాలన్న కట్టుబాటును నాయకులిద్దరూ పునరుద్ఘాటించారు. సాగర ప్రాంత భద్రత, అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు దోహదపడే విధంగా సాగర జలాల్లో రవాణా స్వేచ్ఛ ఉండాలని వారు అభిప్రాయపడ్డారు.

యూరప్, పశ్చిమాసియా/మధ్యప్రాచ్య దేశాల్లోని తాజా సంఘటనలపై తమ లోతైన అంచనాలను ఉభయులు పరస్పరం తెలియచేసుకున్నారు. శాంతి పునరుద్ధరణ, సాయుధ సంఘర్షణల నివారణ; అంతర్జాతీయ న్యాయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి నిబంధనావళి కట్టుబాటుకు ప్రాధాన్యం ఇస్తూ ఇలాంటి వ్యవహారాల్లో ఉభయ దేశాలు అనుసరిస్తున్న వైఖరి పరస్పరం బలం చేకూర్చేదిగా ఉన్నదన్న విషయం వారు గుర్తించారు.

ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కూడా అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్య సమితి నిబంధనావళికి లోబడి శాంతియుత పరిష్కారం కోసం చేసే ఎలాంటి ఉమ్మడి ప్రయత్నానికైనా తమ మద్దతు ఉంటుందని ఉభయ దేశాల నాయకులు మద్దతు ప్రకటించారు. ప్రత్యక్షంగా ఘర్షణ పడుతున్న దేశాలు రెండూ నిజాయతీగా భాగస్వాములై ఇతర భాగస్వామ్య దేశాలన్నీ కలిసికట్టుగా ప్రయత్నించినప్పుడే సమగ్ర, శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని నాయకులిద్దరూ అభిప్రాయపడ్డారు.

సీమాంతర, సైబర్ ఉగ్రవాదం సహా ఏ రకమైన ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సహించబోమని ఉభయ నాయకులు పునరుద్ఘాటించారు. ఉగ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సహాయం, ప్రణాళికల రచన, మద్దతు, ఉగ్రవాద చర్యలకు పాల్పడడం వంటి ఎలాంటి కార్యకలాపాలకైనా ఏ దేశం స్వర్గధామంగా ఉండరాదని వారు నొక్కి చెప్పారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 1267 ఆంక్షల కమిటీ తన జాబితాలో పొందుపరిచిన సంస్థలు, వ్యక్తులు సహా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే వారెవరిపై అయినా సమిష్టి చర్యలు తీసుకోవాలని ఉభయ వర్గాలు పిలుపు ఇచ్చాయి. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటిఎఫ్), నో మనీ ఫర్ టెర్రర్ (ఎన్ఎంఎఫ్ టి) వంటి బహుముఖీన వేదికలపై కలిసి పని చేసేందుకు తమ కట్టుబాటును ఉభయ దేశాలు పునరుద్ఘాటించాయి.

2023 సెప్టెంబరులో ఢిల్లీలో జరిగిన జి-20 శిఖరాగ్రం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ కారిడార్ (ఐఎంఇసి) గురించి నాయకులిద్దరూ గుర్తు చేసుకున్నారు. జి-20కి అద్భుత నాయకత్వం వహించినందుకు ప్రధానమంత్రి శ్రీ మోదీని చాన్సలర్ నెహామర్ అభినందించారు. ఈ ప్రాజెక్టుకు వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్నదంటూ దీని ద్వారా భారత్, మధ్యప్రాచ్య, యూరోపియన్ దేశాల మధ్య వాణిజ్య, ఇంధన సహకారం మరింతగా పెరిగే అవకాశం ఉన్నదని వారు అంగీకరించారు. ఐఎంఇసితో కలిసి పని చేసేందుకు ఆస్ట్రియా ఆసక్తిగా ఉన్నదన్న విషయం చాన్సలర్ నెహామర్ తెలియచేశారు. యూరప్ దేశాల మధ్యలో ఉన్న ఆస్ట్రియా అనుసంధానతకు కీలక దోహదకారిగా ఉంటుందని ఆయన అన్నారు.

భారత్, యూరోపియన్ యూనియన్ రెండూ ప్రపంచంలోనే అతి పెద్ద, శక్తివంతమైన స్వేచ్ఛా మార్కెట్ ప్రదేశాలని పేర్కొంటూ ఇయు-ఇండియా భాగస్వామ్యం పరస్పర లాభదాయకమే కాకుండా ప్రపంచంపై కూడా సానుకూల ప్రభావం చూపుతాయని ఉభయులు నొక్కి చెప్పారు. భారత-ఇయులను మరింత సన్నిహితం చేయడానికి జరిగే ప్రయత్నాలన్నింటికీ మద్దతు ఇవ్వాలని చాన్సలర్ నెహామర్, ప్రధానమంత్రి శ్రీ మోదీ అంగీకరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఇండియా-ఇయు వాణిజ్య, పెట్టుబడి చర్చలకు; ఇయు-భారత అనుసంధానత భాగస్వామ్యం సత్వర అమలుకు నాయకులిద్దరూ గట్టి మద్దతు ప్రకటించారు.

సుస్థిర ఆర్థిక భాగస్వామ్యం

ఉభయ దేశాల మధ్య బలమైన ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యం వ్యూహాత్మక లక్ష్యమని ఉభయులూ గుర్తించారు. ఈ పర్యటనలో భాగంగా వియెన్నాలో పలు కంపెనీల సిఇఓల భాగస్వామ్యంతో తొలి అత్యున్నత స్థాయి ద్వైపాక్షిక వాణిజ్య సమావేశం నిర్వహించడం పట్ల వారిద్దరూ హర్షం ప్రకటించారు. ఆ బిజినెస్ ఫోరంలో నాయకులిద్దరూ ప్రసంగించడంతో పాటు విభిన్న రంగాల్లో నూతన, చలనశీల భాగస్వామ్యాల కోసం కృషి చేయాలని వ్యాపార వర్గాల ప్రతినిధులను ప్రోత్సహించారు.

ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు నడిపించడంలో పరిశోధన, శాస్త్రీయ భాగస్వామ్యాలు, టెక్నాలజీ భాగస్వామ్యాలు, నవకల్పనల కీలక ప్రాధాన్యతను నాయకులిద్దరూ గుర్తించారు. పరస్పర ప్రయోజనం కోసం అలాంటి మరిన్ని అవకాశాల కోసం అన్వేషించాలని వారు పిలుపు ఇచ్చారు. నూతన వ్యాపార రంగాలు, పరిశ్రమ; పరిశోధన, అభివృద్ధి భాగస్వామ్య నమూనాలు వంటి విభిన్న రంగాల్లో టెక్నాలజీలను అభివృద్ధి చేసి వాణిజ్యపరంగా అందుబాటులోకి తేవడంలో బలమైన సహకారం నెలకొనాలని వారు నొక్కి చెప్పారు.

2024 ఫిబ్రవరిలో ఆస్ట్రియా కార్మిక, ఆర్థిక శాఖల మంత్రి భారత సందర్శన, ఆ తర్వాత 2024 జూన్ లో భారత స్టార్టప్ ల బృందం ఆస్ట్రియా సందర్శన సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్టప్ బ్రిడ్జ్ ద్వారా ఉభయ దేశాలు నవకల్పనలు, స్టార్టప్ వ్యవస్థల అనుసంధానత కోసం తీసుకున్న చర్యలను నాయకులిద్దరూ ఆహ్వానించారు. ఆస్ట్రియాకు చెందిన గ్లోబల్ ఇంక్యుబేటర్ నెట్ వర్క్, భారత్ కు చెందిన స్టార్టప్ ఇండియా కార్యక్రమాల ద్వారా భవిష్యత్తులో కూడా ఈ తరహా కృషిని కొనసాగించాలని సంబంధిత సంస్థలను వారు ప్రోత్సహించారు.

భారత, ఆస్ట్రేలియా దేశాలు ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల ఒడంబడిక (యుఎన్ఎఫ్ సిసిసి) సభ్య దేశాలు కావడంతో పాటు ప్రపంచ ఉష్ణోగ్రతల సగటు పెరుగుదలను పారిశ్రామికీకరణ ముందు కాలం నాటి 2 డిగ్రీల సెల్సియస్ కన్నా దిగువకు తీసుకురావాలన్న కట్టుబాటుకు మద్దతు ప్రకటించాయి. ఈ లక్ష్యాలను సాధించగలిగితే వాతావరణ మార్పుల రిస్క్, ప్రభావం గణనీయంగా తగ్గుతుందని ఉభయులు గుర్తించారు. 2050 నాటికి వాతావరణ తటస్థత సాధించేందుకు ఇయు స్థాయిలో ప్రకటించిన కట్టుబాటు, 2040 నాటికి వాతావరణ తటస్థత సాధించేందుకు ఆస్ట్రియా ప్రభుత్వం ప్రకటించిన కట్టుబాటు, 2070 నాటికి నికర జీరో వ్యర్థాల (నెట్ జీరో) లక్ష్యం సాధించేందుకు భారత ప్రభుత్వం ప్రకటించిన కట్టుబాటును వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఆస్ట్రియా ప్రభుత్వం ప్రకటించిన హైడ్రోజెన్ వ్యూహం, ఇంధన పరివర్తన సవాళ్లను దీటుగా ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా భారతదేశం ప్రకటించిన జాతీయ హరిత హైడ్రోజెన్ కార్యక్రమం పరిధిలో ఉభయ దేశాల మధ్య సహకారానికి అవకాశాలెన్నో ఉన్నాయని వారు గుర్తించారు. ఉభయ దేశాల్లోనూ పునరుత్పాదక/హరిత హైడ్రోజెన్ రంగంలో పని చేస్తున్న కంపెనీలు, ఆర్ అండ్ డి సంస్థలు విస్తృత భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు వారు మద్దతు ప్రకటించారు.

స్వచ్ఛ రవాణా; నీరు, మురుగునీటి నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, పునరుత్పాదక ఇంధనం, ఇతర హరిత టెక్నాలజీల రంగాల్లో సహకారంలో భాగంగా పర్యావరణ టెక్నాలజీల ప్రాధాన్యతను నాయకులు గుర్తించారు. ఆయా రంగాలు, వాటి అనుబంధ రంగాల్లో విస్తృత భాగస్వామ్యానికి మద్దతుగా ఏర్పాటవుతున్న వెంచర్లు, ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు పిలుపు ఇచ్చారు. సుస్థిర ఆర్థిక వ్యవస్థ సహా వివిధ పారిశ్రామిక ప్రాసెస్ కార్యకలాపాల్లో (ఇండస్ట్రీ 4.0) పెరుగుతున్న డిజిటల్ టెక్నాలజీల పాత్రను కూడా వారు గుర్తించారు.

భాగస్వామ్య భవిష్యత్తుకు నైపుణ్యాలు

నైపుణ్యాభివృద్ధి, విభిన్న హైటెక్ రంగాల్లో విస్తృత సహకారం నేపథ్యంలో నిపుణులైన సిబ్బంది రాకపోకల ప్రాధాన్యతను చాన్సలర్ నెహామర్, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తించారు. ఈ నేపథ్యంలో ద్వైపాక్షిక వలస, మొబిలిటీ ఒప్పందం అమలును వారు ఆహ్వానించారు. ఇలాంటి కీలకమైన రంగాల్లో నిపుణుల రాకపోకలకు అవకాశం కల్పించడంతో పాటు అక్రమ వలసల నిరోధానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ సహా పరస్పర ఆసక్తి గల విభిన్న రంగాల్లో భవిష్యత్ దృక్పథంతో కూడిన భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉభయ దేశాల విద్యా సంస్థలను వారు ప్రోత్సహించారు.

ప్రజల మధ్య సంబంధాలు

దీర్ఘకాలంగా ఉభయ దేశాల మధ్య నెలకొన్న పరస్పర సాంస్కృతిక మార్పిడి సాంప్రదాయాన్ని నాయకులిద్దరూ ప్రశంసించారు. ఆస్ట్రియాలోని భారత సాంస్కృతికవేత్తలు, ఆస్ట్రియాతో బంధం కలిగి ఉన్న భారతీయ సాంస్కృతిక ప్రముఖుల పాత్రను వారు కొనియాడారు. ఆస్ట్రియన్లలో యోగా, ఆయుర్వేద పట్ల పెరుగుతున్న ఆసక్తిని వారు గుర్తించారు. సంగీతం, నాట్యం, ఒపేరా, నాటక రంగం, చలన చిత్రాలు, సాహిత్యం, క్రీడలు, ఇతర రంగాల్లో ద్వైపాక్షిక బంధం మరింత విస్తరించుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలను వారు ఆహ్వానించారు. సాంస్కృతిక సహకారంపై ఇటీవల ఒక ఎంఓయుపై సంతకాలు చేయడాన్ని కూడా వారు ప్రశంసించారు.

ఆర్థిక, సుస్థిర, సమ్మిళిత వృద్ధి సాధనలోను, ఉభయ దేశాల ప్రజల మధ్య అవగాహన పెంపులోనూ పర్యాటక రంగం పాత్రను వారు గుర్తించారు. ఉభయ దేశాలకు పర్యాటకుల రాకపోకలను పెంచేందుకు వివిధ సంస్థలు చేస్తున్న సంఘటిత కృషిని వారు ప్రోత్సహించారు. అలాగే వైమానిక అనుసంధానత పెంపు, దీర్ఘకాలిక బస, ఇతర చొరవలకు వారు మద్దతు ప్రకటించారు.

బహుముఖీన సహకారం

బహుముఖీనత, ఐక్యరాజ్య సమితి చార్టర్ లోని నిబంధనావళికి నాయకులు తమ కట్టుబాటును పునరుద్ఘాటించారు. క్రమం తప్పకుండా ద్వైపాక్షిక సంప్రదింపుల నిర్వహణ, బహుముఖీన వేదికలపై సహకారం ద్వారా ఈ మౌలిక సిద్ధాంతాల పరిరక్షణ, ప్రోత్సాహానికి కలిసికట్టుగా కృషి చేయాలని వారు అంగీకారానికి వచ్చారు.

భద్రతా మండలి సహా ఐక్యరాజ్య సమితి వ్యవస్థలో సమగ్ర సంస్కరణల సాధనకు తమ కట్టుబాటును వారు పునరుద్ఘాటించారు. 2027-28లో యుఎన్ఎస్ సిలో ఆస్ట్రియా సభ్యత్వానికి భారత్ తన మద్దతు పునరుద్ఘాటించగా 2028-29 సంవత్సరంలో భారతదేశ అభ్యర్థిత్వానికి ఆస్ట్రియా మద్దతు ప్రకటించింది. ఇటీవల నూరవ సభ్యుని కూటమిలోకి ఆహ్వానించడం ద్వారా ఒక కీలకమైన మైలురాయి సాధించిన ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ లో సభ్యదేశంగా చేరాలని ఆస్ట్రియాకు భారతదేశ ఆహ్వానాన్ని ప్రధానమంత్రి శ్రీ మోదీ అందచేశారు.

తన ఆస్ట్రియా పర్యటన సందర్భంగా ఆస్ట్రియా ప్రభుత్వం, ప్రజలు అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చినందుకు చాన్సలర్ నెహామర్ కు ప్రధానమంత్రి శ్రీ మోదీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే వీలు చూసుకుని భారతదేశంలో పర్యటించాలని చాన్సలర్ నెహామర్ ను ప్రధానమంత్రి శ్రీ మోదీ ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని నెహామర్ ఆనందంగా అంగీకరించారు.

# కోర్టు మంజూరుతో దశాబ్దాల కల సాకారం..

## సీఎంకు ఎమ్మెల్యే శ్రీహరి ధన్యవాదాలు



మహబూబ్‌నగర్, జులై 11 : మక్తల్ పట్టణవాసుల దశాబ్దాల కల అయిన కోర్టును మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి నియోజకవర్గ వాసులందరి తరపున ధన్యవాదాలు చెబుతున్నట్టు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్ లో కోర్టు కోసం సీఎం రేవంత్ అడిగిన వారం రోజుల్లోనే అన్ని శాఖల అధికారులను సమన్వాయం చేసుకుంటూ స్పెషల్ సీఎస్ దగ్గరకు వెళ్లి త్వరగా కోర్టు మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడం సంతోషకరమన్నారు.

మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణ మండలంలోని సరిహద్దు గ్రామాల ప్రజలు నారాయణపేటకు వెళ్లి రావాలంటే 140 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయాల్సి ఉంటుందని కోర్టు ఆవశ్యకత తను సీఎంకు వివరించగానే మంజూరు చేశారని తెలిపారు. అతి త్వరలో కోర్టును ప్రారంభించుకుందామని, దీంతో పాటు పశువుల సంత కోసం ఆరు ఎకరాల స్థలం, డిగ్రీ కళాశాల కోసం శాశ్వత భవనం ఇలా మక్తల్ నియోజవర్గంలో అత్యవసరమైన 28 పనులను గ్రామ పద్ధతిలో పరిష్కరించుకుంటూ వెళ్తానని వాకిటి శ్రీహరి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడతానని, తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. జీవితాంతం వారికి సేవ చేసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నేతలు గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి, కట్టా సురేష్ గుప్తా, చంద్రకాంత్ గౌడ్, బి.గణేష్ కుమార్, బోయ రవికుమార్, అయుబ్ ఖాన్, గోపల్లి నారాయణ, తులసిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ డిజిపిగా జితేందర్ నియామకం

హైదరాబాద్ జూలై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ డిజిపిగా సీనియర్ ఐపిఎస్ అధికారి జితేందర్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన డిజిపి హోదాలోనే హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అదేవిధంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రవి గుప్తాను బదిలీ చేశారు. జితేందర్ 1992 ఐపిఎస్ బ్యాచ్ కు చెందినవారు. డిజిపి జితేందర్ స్వస్థలం పంజాబ్ లోని జలంధర్ ప్రాంతం. గతంలో నిర్మల్, బెల్లంపల్లి ఎఎస్ పిగా సేవలందించారు. మహబూబ్ నగర్, గుంటూరు ఎస్పిగా జితేందర్ పని చేశారు. ఆయన సిబిఐలో పని చేయడంతో పాటు గేహౌండ్స్ బాధ్యతలు కూడా నిర్వహించారు. తెలంగాణ డిజిపిగా నియమితులైన సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సీనియర్ ఐపిఎస్ అధికారి జితేందర్ కలిశారు. వచ్చే సంవత్సరం సెప్టెంబర్ వరకు ఆయన పదవీలో ఉండనున్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్టును ఎకనమిక్ హబ్ గా మారుస్తాం- చంద్రబాబు



అమరావతి, జులై 11 :భోగాపురం ఎయిర్ పోర్టును ఎకనమిక్ హబ్ గా మారుస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హెలికాప్టర్ ద్వారా విమానాశ్రయం ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 2026 నాటికి భోగాపురం విమానాశ్రయం తొలిదశను పూర్తి చేస్తామన్నారు. ఈ ఎయిర్ పోర్ట్ పూర్తయితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. దీనిని పూర్తి చేయించే బాధ్యత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుపై ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం కీలకమన్నారు. ఈ ప్రాంతానికి భోగాపురం గ్రోత్ ఇంజిన్‌గా పని చేస్తుందన్నారు.

విమానాశ్రయం పూర్తైతే ఈ ప్రాంతం ఎకనమిక్ హబ్‌గా మారుతుందన్నారు. చుట్టుపక్కల ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. భోగాపురం వరకు బీచ్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఎదగడానికి భోగాపురంకు మంచి అవకాశాలున్నాయన్నారు. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి రోడ్ల కనెక్టివిటీని పెంచాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఎన్నో అంశాలు మళ్లీ మొదటికి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

భోగాపురం విమానాశ్రయం పూర్తైతే ప్రారంభంలోనే 48లక్షల మంది ప్రయాణికులతో రన్ అయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు. భోగాపురం విమానాశ్రయానికి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అనుమతులు వచ్చాయన్నారు. ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఉత్తరాంధ్ర అద్భుత విజయాన్ని అందించిందని? ఇలాంటి ప్రాంతానికి ఏదైనా చేయాలన్నారు. అందువల్లే జిల్లా పర్యటనల్లో భాగంగా తొలుత ఉత్తరాంధ్రకే వచ్చానన్నారు. విశాఖపట్నం విజయనగరం కలిసిపోతున్నాయన్నారు. భవిష్యత్తులో విశాఖ, శ్రీకాకుళం కూడా కలిసిపోతాయన్నారు. విశాఖపట్నానికి మెట్రో రావాల్సి ఉందన్నారు. మున్ముందు కుప్పం సహా ఐదు విమానాశ్రయాలు వస్తాయన్నారు.

# డిపిఐఐటి, ఇన్వెస్ట్ ఇండియాల సహకారంతో రెండో 'టాయ్ సిఇఒ మీట్'ను నిర్వహించిన భారతీయ ఆటబొమ్మల సంఘం




న్యూఢిల్లీ, జులై 11 :భారతదేశంలో చేతివృత్తులవారికి అండగా నిలవడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా చిన్నారుల్లో ప్రేరణను కలిగించే, వారికి చైతన్యాన్ని అందించే ఆటబొమ్మల మాధ్యమం ద్వారా సృజనాత్మకతను, కల్పనశీలత్వాన్ని పెంచి పోషించాలని వాణిజ్యం, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద ఆటబొమ్మల తయారీ పరిశ్రమ కు సూచించారు. డిపార్ట్ మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రి ఎండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి), ఇన్వెస్ట్ ఇండియా ల సహకారంతో 'టాయ్ సిఇఒ మీట్ రెండో సంచిక' కార్యక్రమాన్ని 2024 జులై 8వ తేదీన న్యూ ఢిల్లీ లో భారతీయ ఆటబొమ్మల సంఘం నిర్వహించగా ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని, కీలకోపన్యాసం చేశారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" దార్శనికతను గురించి మంత్రి తన ప్రసంగం లో ప్రముఖంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సహకారాన్ని కొనసాగించాలని, భారతదేశ ఆటబొమ్మల తయారీ వారసత్వాన్ని ఘనంగా ముందుకు తీసుకుపోవాలని మంత్రి సూచించారు.

భారతదేశాన్ని ఒక గ్లోబల్ టాయ్ హబ్ గా నిలిపే విశిష్ట కార్యాన్ని సాధించే దిశలో ముందుకు పోవాలనే లక్ష్యంతో, భారతదేశ ఆటవస్తువుల తయారీ పరిశ్రమకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటవస్తువుల తయారీ పరిశ్రమకు మధ్య సమన్వయానికి ఒక వేదికను 'టాయ్ సిఇఒ మీట్ రెండో సంచిక' అందించింది. ఈ కార్యక్రమంలో వాల్ మార్ట్, అమెజన్, స్పిన్ మాస్టర్, ఐఎమ్ సి టాయస్ వంటి ప్రముఖ ప్రపంచ ఆటవస్తువుల తయారీ సంస్థలతో పాటు సన్ లార్డ్ అపేరల్స్ మేన్యుఫేక్చరింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, ప్లేగ్రో టాయస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లు సహా దేశీయ ఆటవస్తువుల పరిశ్రమలోని సభ్యులు కూడా పాలుపంచుకొన్నాయి.

కార్యక్రమం లో పాల్గొన్న వారిని ఉద్దేశించి డిపిఐఐటి కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ ప్రసంగిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు, దేశీయ తయారీదారు సంస్థలు చేస్తున్న కృషి ఫలితంగా భారతదేశంలో ఆటవస్తువుల తయారీ పరిశ్రమ ప్రశంసాయోగ్యమైన వృద్ధిని సాధించగలిగిందన్నారు. ఈ వికాసం భారతదేశం స్వయం సమృద్ధి అంతకంతకు వృద్ధి చెందుతూ ఉండడాన్ని, ఆట వస్తువుల తయారీలో సామర్థ్యం అధికమవుతూ ఉండడాన్ని సూచిస్తోందని ఆయన అన్నారు.

డిపిఐఐటి సంయుక్త కార్యదర్శి శ్రీ సంజీవ్ మాట్లాడుతూ, భారతదేశ ఆటవస్తువుల పరిశ్రమ చేస్తున్న ప్రయత్నాలను ప్రత్యేకించి, 'పదిహేనో టాయ్ బిజ్ ఇంటర్ నేషనల్ బి2బి ఎక్స్ పో' ను విజయవంతంగా నిర్వహించినందుకుగాను భారతీయ ఆటడొమ్మల సంఘం చేసిన ప్రయత్నాలను ప్రశంసించారు. ఆట వస్తువుల పరిశ్రమ సభ్యులు ఏవైనా సవాళ్ళు ఎదురైన పక్షంలో డిపిఐఐటి దృష్టికి తీసుకురావాలని, భారతదేశంలో తయారయ్యే ఆటబొమ్మలు నాణ్యతకు, అద్వితీయతకు, వినూత్నత్వానికి, మన్నికకు మారుపేరుగా ఉండేటట్లు చూడటవే కర్తవ్యమని ఆయన అన్నారు.

ఆట బొమ్మల తయారీకి భారతదేశంలో ఉన్న పెట్టుబడికి అవకాశాలను గురించి ఇన్వెస్ట్ ఇండియా సిఇఒ, ఎమ్‌డి నివృత్తి రాయ్ చర్చించారు. పిల్లల జన సంఖ్య పెరుగుతూ ఉన్న కొద్దీ పెట్టుబడి కి గిరాకీ కూడా పెరుగుతుందని, ఈ కారణం గా భారతదేశం లో పెట్టుబడికి చాలా పెద్ద మార్కెట్టు ఏర్పడుతుందని ఆమె అన్నారు.

స్టేక్ హోల్డర్స్ తో చర్చ సాగిన క్రమంలో వాల్ మార్ట్, ఐఎమ్‌సి టాయస్, స్పిన్ మాస్టర్ వంటి ప్రపంచ ఆటవస్తువుల రంగం లోని దిగ్గజాలు వారి వారి సంస్థల వృద్ధి గాథలను గురించి వివరించారు. భారతదేశంలో కార్యకలాపాలను విస్తరించాలని వారు ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. సభలో మాట్లాడిన వారు చెప్పిన వివరాలను బట్టి, భారతదేశంలో ఆటవస్తువుల పరిశ్రమ లోలోపలి అంశాలు, వృద్ధికి, సహకారానికి ఉన్న అవకాశాలు ఏమిటనేవి శ్రోతలకు తెలిసి వచ్చాయి. భారతదేశ ఆట వస్తువుల తయారీ పరిశ్రమకు ప్రపంచ విపణిలో అందివచ్చే అవకాశాలను సద్వినియోగపరచుకోవడంలో, భారతదేశానికి ఉన్న సామర్థ్యాలను సాటి దేశాలతో కలబోసుకొంటూ ముందడుగులు వేయడంలో, కొత్తగా ఉనికి లోకి వస్తున్న అవకాశాలను ఉపయోగించుకోవడంలో ఈ కార్యక్రమం ఒక కీలకమైన పాత్రను పోషించింది.

ఈ కార్యక్రమాన్ని దేశంలో అతి పెద్దదైన ఆటబొమ్మల మేళాలలో ఒకటైన 'ఇండియా టాయ్ బిజ్ ఇంటర్ నేషనల్ బి2బి ఎక్స్ పో పదిహేనో సంచిక'లో ఒక భాగంగా నిర్వహించడమైంది.

ఈ కార్యక్రమం దేశీయ ఆటబొమ్మల తయారీ రంగంలో నానాటికీ పెచ్చుపెరుగుతున్న అవకాశాలను సద్వినియోగ పరచుకోవడం కోసం ప్రపంచంలోని ప్రముఖ ఆట వస్తువుల తయారీదారు సంస్థలను, దేశం లోని ఆట వస్తువుల తయారీదారు సంస్థలను, చేతివృత్తులవారిని, రిటేలర్లను, ప్రభుత్వ అధికారులను ఒక చోటికి చేర్చింది.

# ప్రేమిస్తున్న అమ్మాయితో పెళ్లి చేయడానికి నిరాకరించారన్న కోపం...

## -తల్లిదండ్రులు, అన్నను చంపిన 15 ఏళ్ల బాలుడు

లక్నో జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గత రెండేళ్లుగా తాను ప్రేమిస్తున్న అమ్మాయితో పెళ్లి చేయడానికి నిరాకరించారన్న కోపంతో ఒక 15 ఏళ్ల బాలుడు తన తల్లిదండ్రులతోపాటు సోదరుడిని హత్యచేశాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లాలో జులై 7-8 రాత్రి ఈ దారుణ ఘటన జరిగింది. నంద్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని కుసుబికల గ్రామంలో సంచలనం సృష్టించిన ఈ మూడు హత్యల ఘటనలో మెడలు కోయడానికి ఉపయోగించిన పదునైన ఆయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నేరాన్ని ఒప్పుకున్న ఆ బాలుడిని అరెస్టు చేశారు. మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పదునైన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. తన తండ్రి మున్నీ బింద్(45), తల్లి దేవంతి(40), అన్న రాం ఆశీష్(20)ను తానే గొంతు కోసి చంపివేసినట్లు మైనర్ బాలుడు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. చాలా రోజుల క్రితమే ఈ ముగ్గురినీ చంపాలని తాను నిర్ణయించుకున్నానని, గడ్డి కోసేందుకు ఉపయోగించే కొడవలిని సంపాదించి దానికి చాలా రోజులుగా పదును పెట్టానని ఆ బాలుడు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. జులై 7న ఈ ముగ్గురినీ చంపాలని భావించినప్పటికీ ధైర్యం చాలక ఆ పని చేయలేకపోయానని బాలుడు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తన కుటుంబ సభ్యులు అందరూ నిద్రిస్తుండగా తాను మద్యంతాగి అర్థరాత్రి ఒంటిగంటకు తన తండ్రి, తల్లి, అన్న గొంతు కోసి చంపానని అతను చెప్పాడు. హత్యలు చేసిన తర్వాత కొడవలిని కొద్ది దూరంలోని పొలాలలో దాచిపెట్టినట్లు బాలుడు చెప్పాడు. ఆ తర్వాత తన కుటుంబ సభ్యులను ఎవరో హత్య చేశారని గ్రామస్తులకు తెలియచేసేందుకు గట్టిగా కేకలు వేశానని ఆ బాలుడు పోలీసులకు తెలిపాడు. ఆ బులడిని జువెనైల్ కోర్టులో హాజరువరుస్తామని పోలీసులు తెలిపారు.




# ఉత్తరాంధ్రకు గోదారిని తెస్తాం.. సుజల స్రవంతితో సాగునీళ్లిస్తాం : చంద్రబాబు

-ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి టెండర్లు పిలుస్తాం
-ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచారు
-రాష్ట్రాన్ని దివాలా తీయించారు
-డబ్బులు లేని పరిస్థితి తలెత్తింది
-పరిస్థితులన్నీ ప్రధాని మోదీకి వివరించాం
-అనకాపల్లిలో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, జులై 11 : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తైతే ఉత్తరాంధ్రలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించవచ్చని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. సుజల స్రవంతిని పూర్తి చేస్తే ఉత్తరాంధ్ర ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం



చేశారు. అనకాపల్లి జిల్లాలో 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. సుజల స్రవంతి పనుల్లో టీడీపీ హయాంలో చేసిన పనులు తప్ప గత ప్రభుత్వంలో ఒక్క ముందడుగు పడలేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, ఒక్క ఇంచు కూడా పని ముందుకు కదల్లేదన్నారు. ఐదేళ్లలో ఎక్కడైనా తట్ట మట్టి వేశారా.. అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఉత్తరాంధ్రలో చంద్రబాబు నాయుడు పర్యటించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం దార్లపూడి వద్ద గురువారం పోలవరం ఎడమ కాల్వను పరిశీలించారు. అంతకుముందు కాల్వ పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనకు వచ్చిన సీఎంకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

**ప్రజల రుణం తీర్చుకునే బాధ్యత నాపై ఉంది**

'ఓట్లు వేసి గెలిపించిన వారి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. రాష్ట్రంలో ఉభయ గోదావరి జిల్లాల తర్వాత ఎక్కువ ఆదరించిన ప్రాంతం ఉత్తరాంధ్ర. కూటమి అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడానికే ఇక్కడికి వచ్చా. భగవంతుడు నాకు ఇచ్చిన శక్తినంతా ఉపయోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా. టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి కూటమిగా వచ్చాయి. అరాచకాలు చేసిన వ్యక్తిని, తప్పులు చేసిన వ్యక్తిని ప్రజాకోర్టులో శిక్షించారు. రాజకీయాల్లో విర్రవీగితే సరిచేసే శక్తి ప్రజలకే ఉంది. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలబడాలని ఎన్నికల ముందు ప్రచారం చేశాం. ఇప్పుడు ప్రజలు గెలిచారు..రాష్ట్రాన్ని నిలబెట్టడానికి మేము కష్టపడతాం. ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశాం. పోలవరంను 72 శాతం నేను పూర్తి చేశాను. ఒక దుర్మార్గుడు వచ్చి డయాఫ్రం వాల్ ను గోదావరిలో కలిపేశారు. కాఫర్ డ్యామ్ లు డ్యామేజ్ అయ్యాయి. 2021 జూన్ కు నీళ్లు రావాల్సి ఉండగా నిర్వీర్యం చేశారు. పోలవరం రాష్ట్రానికి వరం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి పోలవరం ద్వారా గోదావరి నీళ్లు తీసుకొస్తే ప్రతి ఎకరాకు నీరు అందించొచ్చు.. కరవు అనే సమస్య ఉండదు. గత ప్రభుత్వ నిర్వాకంతో పోలవరం పూర్తవ్వడానికి ఆలస్యం అవుతోంది. అందువల్ల పురుషోత్త పట్నం, పుష్కర్ లిఫ్ట్ ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని ఈ ప్రాంతానికి తీసుకురావొచ్చు. అండర్ పాస్ లకు కూడా టెండర్లు పిలిచి త్వరితగతిన పూర్తి చేస్తాం.' అని సీఎం తెలిపారు.

**నదుల అనుసంధానంతో కరవు నివారణ**

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతిలో కుడి కాలువ 214 కి.మీ పూర్తి కావాల్సి ఉంది. మొదటి విడతగా కాలువను 93 కి.మీ పూర్తి చేయడానికి రూ.800 కోట్లు ఖర్చు అవుతుంది. దీంతో లక్ష ఎకరాలకు అనకాపల్లి పరిధిలో నీరందించవచ్చు. ఇప్పుడే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. యాక్షన్ ప్లాన్ తయారు చేశాక మరింత వేగవంతంగా పనులు పూర్తి చేస్తాం. ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పోలవరం కుడి కాల్వ ద్వారా సాగునీరు అందించవచ్చు. 23 టీఎంసీల నీళ్లతో అనకాపల్లి జిల్లాలో ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరందించవచ్చు. రూ.800 కోట్లు ఖర్చు చేసి 93వ కి.మీ వరకు 2.20 లక్షల ఎకరాలకు నీరందించేందుకు మొదటి విడతలో పనులు పూర్తి చేస్తాం. ఈ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంశధార నది దాకా వెళుంది. వంశధార-గోదావరి-కృష్ణా-పెన్నా నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలో కరవు లేకుండా చేస్తాం." అని సీఎం స్పష్టం చేశారు

**గత ప్రభుత్వ అసమర్థ కారణంగా 3 షుగర్ ఫ్యాక్టరీలు మూత**

"ఈ ప్రాంతంలోని షుగర్ ఫ్యాక్టరీ రైతులకు కూడా హామీ ఇస్తున్నా.. గత అసమర్థ ప్రభుత్వం కారణంగా 3 షుగర్ ఫ్యాక్టరీలు పడకేశాయి. ఇక్కడి రైతులకు కూడా న్యాయం జరగాలి.. వారి భాగస్వామ్యంతోనే ఫ్యాక్టరీలు నడవాలి. రైతులకు న్యాయం చేస్తాం. శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తాం. నేను కష్టపడతాను.. సంపద సృష్టించి ఆదాయం పెంచి పేదలకు పంచుతాం. మీకు వెసులుబాటు ఇవ్వాల్సిన బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై ఉంది. దేశంలో ఎక్కడా ఇవ్వని విజయాన్ని ఏపీ ప్రజలు ఎన్డీయేకు ఇచ్చారు. ఇది చారిత్రక విజయం. 95 వేల మెజారిటీతో అభ్యర్థులను గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడం మా బాధ్యత. దొంగ మాటలు చెప్పేవాళ్ల మాటలు నమ్మి బజారులో తిరగనిస్తే బతుకులు ఏమవుతాయో ఆలోచించాలి." అని సీఎం పిలుపునిచ్చారు

**విశాఖ స్టీల్ ప్లాంట్ పై తప్పుడు ప్రచారం**

"విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఏ విధంగా కాపాడుకోవాలో ఆలోచిస్తున్నాం.. కానీ ఒక పనికి మాలిన పార్టీ ఉంది.. ఆ పార్టీ నేతల పొట్ట నిండా అబద్ధాలే. వారికి కల వచ్చిందంటా? అమ్మడానికి నేను ఒప్పుకున్నానంట. తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు. "విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు" అని పోరాడి ఫ్యాక్టరీని సాధించుకున్నాం. నాడు ప్రైవేట్ పరం చేస్తామని ప్రతిపాదనలు వచ్చినప్పుడు నేను పోరాడి అడ్డుకున్నా. కేంద్రం నుండి ఆర్థిక సాయం కూడా తీసుకొచ్చాం. స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునే బాధ్యత మాదే. అబద్ధాలు చెప్పే వారి మాటలు ఖండిస్తూ వాస్తవాలు చెప్పాలి. కరుడుగట్టిన ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచేశారు..వీళ్లను వదలిపెట్టను. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పని చేస్తా." అని సీఎం చంద్రబాబు అన్నారు.

**జగన్ అనే భూతాన్ని భూస్థాపితం చేయాల్సింది ప్రజలే**

"సూపర్-6 హామీలు కూడా త్వరలో అమలు చేస్తాం.. ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం. 30 రోజులు కూడా కాలేదు.. అయినా చెప్పినమాట ప్రకారం పింఛన్ ను రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచాం. మూడు నెలల బకాయిలు కలిపి రూ.7 వేలు ఒకేసారి అందించాం. దేశంలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టం. మొదటి సంతకం డీఎస్సీపైనే పెట్టి 16,347 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపాం. మీ భూములు కొట్టేసేందుకు తెచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ను కూడా రద్దు చేశాం. 183 అన్న క్యాంటీన్లను ఆగస్టు 15 నుండి ప్రారంభించబోతున్నాం. పేదవాడికి అన్నం పెడితే సహించలేని మనస్తత్వం గత ప్రభుత్వానిది. పెట్టుబడిదారులతో మాట్లాడుతుంటే, మీ రాష్ట్రంలో భూతం ఉంది? అది లేస్తే ఏమవుతుందోనని అన్నారు. ఆ భూతానికి భూత వైద్యం చేసి శాశ్వతంగా భూ స్థాపితం చేసే బాధ్యత ప్రజలకే అప్పజెప్పామని వారితో చెప్పా. ఆ భూతాన్ని కంట్రోల్ చేసే వైద్యులు ప్రజలే." అని అన్నారు.

**కార్పెట్ కల్చర్ అధికారులు వీడాలి**

"ప్రజల ఆదాయం పెంచే మార్గం చూస్తాం. స్కిల్ గణన చేసి యువతలో నైపుణ్యం పెంచేందుకు శ్రీకారం చుట్టబోతున్నాం. ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి అందిస్తున్నాం. నేను, పవన్ కళ్యాణ్, మోదీ చెప్పిన మాటలను ప్రజలు నమ్మి విశ్వసించారు. నెంబర్ వన్ రాష్ట్రంగా తయారు చేస్తాం. సచివాలయ సిబ్బందితో ఒకే రోజు పింఛన్లు అందించాం? కానీ నాటి ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ సాధ్యం కాదని చెప్పింది. పెంచిన పింఛన్లు ఇస్తూనే ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించాం. మాపై అభిమానం అనే పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. ప్రజలు కూడా నేతలకు సహకరించాలి. మీ శ్రేయస్సే మా అభిమతం. నవ్వినా కొట్టే వ్యక్తి మొన్నటిదాకా పాలించారు. మీరంతా సంతోషంగా ఉండాలి.. మీ సంతోషం కోసం మేము పని చేస్తాం. గత ముఖ్యమంత్రి ఎక్కడికైనా వస్తే చెట్లు నరికి, పరదాలు కట్టి, షాపులు మూయించేవారు. ఇక్కడ అధికారులు కార్పెట్లు వేశారు.. ఇక్కడికి రాజులు రాలేదు ప్రజలకు సేవ చేయడానికి వచ్చాం. ఈ కార్పెట్ కల్చర్ అధికారులు వదలాలి. అందరం మట్టిలోనే పుట్టాం.. చనిపోయినా మట్టిలోకే పోతాం. ఆడంబరాలు అవసరం లేదు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తే చాలు. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

# భూ సేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించాలి..

- రైతులతో కలెక్టర్లు నేరుగా మాట్లాడాలి
-ఆర్ఆర్ఆర్ అంతటికీ ఒకే నెంబర్
- ప్రత్యామ్నాయ భూ కేటాయింపులతో అటవీ భూముల స్వాధీనం
-ఎన్ హెచ్ఏఐ పరిధి సమస్యలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలన్నారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులతో పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దని, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఎన్ హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం (ట్రై పార్టియేట్ అగ్రిమెంట్) కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణలో ఉన్న ఆటంకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలైన్ మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్ కు ముఖ్యమంత్రి సూచించారు. నాగ



పూర్-విజయవాడ కారిడార్ లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్ హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్ పూర్-విజయవాడ కారిడార్ లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్ పాస్ లు నిర్మించాలని ఎన్ హెచ్ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన సమీక్షలో వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి తెలిపారు. గ్రావెల్ రహదారి నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**సమన్వయంతో ముందుకు సాగండి..**

ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, విజయవాడ-నాగ్ పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్య సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలని, ఏవైనా సమస్యలుంటే ఎన్ హెచ్ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ -మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అందుకు ఎన్ హెచ్ ఏఐ అధికారులు అంగీకరించారు.

**రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు శేషాద్రి, మాణిక్ రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాసరాజు, ఎన్ హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీష్, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆ బాలిక జాడ లేదు..ముచ్చుమర్రి కాలువలో కొనసాగుతున్న అన్వేషణ

-రంగంలో గజ ఈతగాళ్ల బృందం
-30 అడుగుల లోతులోనూ పరిశీలన
-ఘటనా స్థలిలోనే నంద్యాల కలెక్టర్
-ఎస్పీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

అమరావతి, జులై 11:నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో ఇప్పటి వరకూ బాలిక జాడ దొరకలేదు.



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కాలువలో బాలిక మృతదేహం కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎన్టీఆర్ఎఫ్ బృందాన్నీ రంగంలోకి దింపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజాకుమారి, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిగురువారం ఘటన స్థలికి వచ్చారు. విశాఖ పట్నం నుంచి గజ ఈత బృందాన్ని రంగంలోకి దించారు.

**రెండ్రోజులుగా కొనసాగుతున్న అన్వేషణ**

పోలీసుల సూచనతో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక మత్స్యకారులు వలలతో తీవ్రంగా గాలించారు. మరోవైపు గజ ఈతగాళ్లను సైతం రప్పించి గాలింపు చేపట్టారు. ఎంతకీ బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులు మరోసారి నిందితులను గట్టిగా ప్రశ్నించడంతో పంపుహౌస్ సమీపంలోనే పడేసినట్లు చెప్పడంతో ఆ ప్రాంతంలో గాలిస్తున్నారు. 30 అడుగుల నీటిలోనూ గాలిస్తున్నారు. నలుగురు బాలురు కలిసి బాలికను తీసుకెళ్లినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. పోలీసులు ముగ్గురిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. మరో బాలుడు లైంగిక దాడికి పాల్పడలేదని మిగతా ముగ్గురు నిందితులు పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది.

నంద్యాల జిల్లాలో బాలికపై ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసి చంపేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. బాలికపై దారుణానికి ఒడిగట్టడంతో చిన్నారి చనిపోగా.. నిందితులు మృతదేహాన్ని హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో పడేశారు. ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నిందితులు చెప్పిన వివరాల ప్రకారం నదిలో గాలింపు చేపట్టారు. నిందితులు మంగళవారం నేరాన్ని అంగీకరించారని.. అదే రోజు సాయంత్రం వారిని ఘటనా స్థలానికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌కు కొంతదూరంలో కాలువలో బాలిక మృతదేహాన్ని పడేసిన ప్రాంతాన్ని చూపించారని చెప్పారు.

# బీహార్‌లో కూలిపోయిన మరో వంతెన

బీహార్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బీహార్‌లో బుధవారం మరో వంతెన కూలిపోయింది. గడచిన మూడు వారాల కాలంలో వంతెన కూలిపోవడం ఇది 13వ ఘటన. బుధవారం తెల్లవారుజామున సహర్సా జిల్లాలోని మహిషి గ్రామం వద్ద వంతెన కూలిపోయినట్లు అధికారి ఒకరు తెలిపారు. అది చిన్న వంతెనో లేక కాజ్‌వేనో కావచ్చని, ఘటనా స్థలానికి అధికారులు తరలి వెళ్లారని, మరింత సమాచారం కోసం ప్రయత్నిస్తున్నామని అదనపు కలెక్టర్(సహర్సా) జ్యోతి కుమార్ తెలిపారు.అయితే ఈ ఘటనలో ఎవరైనా మరణించిందీ లేక గాయపడిందీ వంటి వివరాలు తెలియరాలేదు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని సివాన్, శరణ్, మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్‌తోసహా వివిధ జిల్లాలలో వంతెనలు కూలిపోయిన ఘటనలకు సంబంధించి 15 మంది ఇంజనీర్లను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రాష్ట్రంలోని పాత వెంతెనలను సర్వే చేసి చి వాటికి అవసరమైన మరమ్మతులను గుర్తించాలని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అధికారులను ఇటీవల ఆదేశించారు.

# సబ్సిడీ ధరలకే బియ్యం, కంది పప్పు..తొలి స్టాల్‌ను ప్రారంభించిన మంత్రి నాదెండ్ల



విజయవాడ , జులై 11 : నిత్యావసర సరకులను రాయితీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు రైతు బజార్లలో రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విజయవాడ ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్లో తొలి కౌంటర్‌ను నేడు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పౌరసరఫరాలశాఖ, కృష్ణా జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో సామాన్యులకు నిత్యావసర సరకులను రాయితీపై అందిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా ప్రజల కష్టాలు తీర్చేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హోల్ సేల్ దుకాణదారులు, రిటైల్ వర్తకులు సైతం 160 రూపాయలకే నాణ్యమైన కిలో కందిపప్పు, తక్కువ ధరకే బియ్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో పంచదార సహా పలు చిరుధాన్యాలనూ రైతు బజార్ల ద్వారా రాయితీపై పంపిణీ చేస్తామని తెలిపారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, 5 కిలోల బియ్యం చొప్పున అందిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

**రేషన్ బియ్యం స్కామ్ లో అయిదుగురు ఐపిఎస్ లు**

రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉందని నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాకినాడలో 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశామని తెలిపారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఇవ్వాల్సిన రూ.600 కోట్లు త్వరలో చెల్లిస్తామన్నారు. ధరల స్థిరీకరణపై రిటైల్ వర్తకులతో మంత్రి సమీక్షించారు.

**బందరులో స్టాల్ ప్రారంభించిన మంత్రి కొల్లు**

మచిలీపట్నం లోని రైతుబజారులో కందిపప్పు, బియ్యం స్టాల్ ను మంత్రి కొల్లు రవీంద్రగురువారం ప్రారంభించారు. సబ్సిడీ ధరలకు రైతు బజారులో బియ్యం, కందిపప్పును ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు రైతుబజార్లలో రాయితీపై బియ్యం, కందిపప్పు పంపిణీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు.

# లడఖ్‌లో 108 కిలోల బంగారం స్వాధీనం

-ముగ్గురు వ్యక్తులను అరెస్టు

లడక్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారత్-చైనా సరిహద్దుల్లో 108 బంగారు కడ్డీలను ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసు(ఐటిబిపి) స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఐటిబిపి అధికారి ఒకరు బుధవారం తెలిపారు.

ఒక్కో బంగారు కడ్డీ కిలో బరువు ఉన్నట్లు ఆయన చెప్పారు. స్మగ్లింగ్ చేసి తీసుకువచ్చిన బంగారు కడ్డీలతోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైనాకులర్, రెండు కత్తులు, కేకులు, పాలు వంటి చైనా తయారీ ఆహార పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆ అధికారి తెలిపారు. ఐటిబిపి చరిత్రలోనే ఇది అత్యంత భారీ స్వాధీనమని, స్వాధీనం చేసుకున్న వస్తువులను కస్టమ్స్ శాఖకు అప్పగిస్తామని ఆయన తెలిపారు. వేసవి కాలంలో స్మగ్లింగ్ పెరిగే అవకాశం ఉన్న కారణంగా స్మగ్లర్ల కార్యకలాపాలను అరికట్టేందుకు చిజ్‌బులే, నర్బులా, జాంగిల్, జాకియాతోసహా తూర్పు లడఖ్‌లోని చాంగ్‌థాంగ్ సబ్ సెక్టార్‌లో ఐటిబిపి బలగాలు మంగళవారం మధ్యాహ్నం నుంచి విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. వాస్తవాధీన రేఖకు కిలోమీటరు దూరంలోని శ్రీరాపిల్‌లో స్మగ్లింగ్ జరుగుతున్నట్లు ఐటిబిపికి సమాచారం అందింది. గాడిదపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారు తప్పించుకుని పరారయ్యారు. వారిని వెంబడించి పట్టుకుని తనిఖీలు జరపగా బంగారు కడ్డీలతోసహా ఇతర వస్తువులు లభించినట్లు అధికారి చెప్పారు. వారు ఇచ్చిన సమాచారంతో మరో వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. వీరంతా లడఖ్‌లోని న్యోమా ప్రాంతానికి చెందిన వారిగా అధికారులు గుర్తించారు. మరింత సమాచారం కోసం ఐటిబిపి, పోలీసులు సంయుక్తంగా ప్రశ్నిస్తున్నట్లు అధికారి చెప్పారు.

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతా : ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి, జులై 11 :అక్కా చెల్లెమ్మలకు, అవ్వాతాతలకు ఇచ్చిన దానికంటే జగన్ దోచిందే ఎక్కువని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఆర్థిక మంత్రిగా పయ్యావుల కేశవ్ ఏపి సచివాలయంలో గురువారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. వెంటనే 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు స్థానిక సంస్థలకు విడుదల చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం తన మొదటి బాధ్యతగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 16 పథకాలను ఆపేసిందని.. వాటిలో 60 శాతం రాష్ట్రం? 40 శాతం కేంద్రం నిధులు పెట్టేవని పేర్కొన్నారు. వీటి మొత్తాన్ని ఆపేశారని పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

**కేంద్రం నిధులు వాడులోనే స్థితి..**

కేంద్రం నిధులు కూడా వాడుకోని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందన్నారు. వ్యవస్థలు అన్నీ గాడి తప్పాయన్నారు. ఎవరు జగన్‌కి సలహా ఇచ్చారో కూడా తెలియదని పయ్యావుల కేశవ్ అన్నారు.రాష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం.. ఎకానమీని పునరుద్ధరించడం తమ లక్ష్యమని పయ్యావుల కేశవ్ తెలిపారు. గడచిన ఐదేళ్లలో వ్యవస్థను దెబ్బతీశారన్నారు. కామన్ మ్యాన్ నుంచి వచ్చే కన్నా పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగిస్తే ఎంతో మేలన్నారు. ఎలక్ట్రిసిటీపై డ్యూటీలను దారుణంగా పెంచారన్నారు. అక్క చెల్లమ్మలకు, అవ్వ తాతలకు జగన్ ఇచ్చిన దాని కన్నా దోచింది ఎక్కువని పయ్యావుల కేశవ్ అన్నారు. చంద్రబాబు టీం శక్తికి మించి ఈ రాష్ట్రం కోసం పని చేస్తోందన్నారు. ఏపీలో టాక్సాషన్‌ను కౌంటర్ ప్రొడక్ట్ లెవెల్‌కి తీసుకు వెళ్లారన్నారు. టాక్స్‌లు పెంచడం ఒక స్థాయికి తెచ్చారని.. చివరకు భరించలేకుండా చేశారన్నారు. వ్యాపారాలను ధ్వంసం చేశారన్నారు.




# జిల్లా వ్యాప్తంగా ఘనంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు...

-అల్పాహారం, అన్న దాన వితరణ, రక్తదాన శిబిరాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టిన బిజెపి శ్రేణులు...
-క్షేత్రస్థాయి నుండి రాణించిన దిగ్విజనేత బండి సంజయ్ కుమార్....
-బండి సంజయ్ కుమార్ రాజకీయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం... ఆదర్శనీయం...
-బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి....



కరీంనగర్, జులై 11 : (నేటినిజం ప్రతినిధి) బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు గురువారం రోజున జిల్లావ్యాప్తంగా అంగరంగ వైభవంగా ఘనంగా కొనసాగాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో బిజెపి శ్రేణులు పలు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రభుత్వానువత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. టవర్ సర్కిల్ వద్ద బిజెపి నాయకులు కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ లఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం తోపాటు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. వృద్ధా, అనాథ ఆశ్రమాల్లో, ఆసుపత్రులలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్ బుక్ లు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రధాన దేవాలయాలలో బండి సంజయ్ కుమార్ పేరిట ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో భారీ సంబరాలు జరిగాయి. కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా కరీంనగర్ పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాలకు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ రాజకీయ ప్రస్థానం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం ఆదర్శనీయమన్నారు. క్షేత్రస్థాయి నుండి రాణించిన దిగ్విజయనేత బండి సంజయ్ కుమార్ అన్నారు. బాల్యం నుంచే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో స్వయం సేవకుడిగా, అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ లో . బీజేవైఎం లో వివిధ హోదాలో పనిచేశారని తెలిపారు. భారతీయ జనతా పార్టీలో పట్టణ, జిల్లా , రాష్ట్ర, జాతీయ స్థాయి పదవులు చేపట్టారన్నారు.

ది కరీంనగర్ కో-ఓపరేటివ్ అర్బన్ డైరెక్టర్ గా,కరీంనగర్ నగర పాలక సంస్థ గా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిగా 48వ డివిజన్ నుండి బిజెపి కార్పొరేటర్ గా, రెండవసారి అదే డివిజన్ నుండి భారీ మెజారిటీ తో విజయం సాధించారన్నారు. 2014, 2019 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి చెందిన,2019 పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా పోటీచేసి, టీఆరెస్ కంచుకోటను బద్దలు కొట్టి 96వేల పైచిలుకు ఓట్లతో బండి సంజయ్ కుమార్ ఘనవిజయం సాధించారన్నారు. 2023 నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి, 89016 ఓట్లు సాధించి 3163 ఓట్ల తేడాతో ఓటమి చెందిన

అనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి 5,85,116 ఓట్లు సాధించి, 2,25,209 మెజారిటీతో బండి సంజయ్ కుమార్ రెండవ సారి ఎంపిగా గెలుపొంది, రికార్డులను బద్దలు కొట్టి, కరీంనగర్ చరిత్రలో మరో కొత్త రికార్డు నెలకొల్పారన్నారు. పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకొని క్రమశిక్షణ తోనడుచుకుంటూ క్షేత్రస్థాయి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన బండి సంజయ్ కుమార్ నేడు కేంద్రమంత్రి స్థాయి వరకు ఎదిగారని, ఇది కేవలం బిజెపి పార్టీలోనే సాధ్యమన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇలాంటి జన్మదినోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని, మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, బిజెపి జిల్లా పక్షాన కోరుకుంటున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు బాన సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, కన్న కృష్ణ, మాజీ మేయర్ డి శంకర్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, రాపర్తి ప్రసాద్, కటకం లోకేష్, దురుశెట్టి సంపత్, కార్పొరేటర్లు కాసర్ల ఆనంద్, అనుప్, కోలగని శ్రీనివాస్, పెద్దపల్లి జితేందర్, చొప్పరి జయశ్రీ, దుబాల శ్రీనివాస్, గౌతమ్ రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, దండు కొమురయ్య , పుప్పాల రఘు , బల్వీర్ సింగ్ , వాసు, శిల్పా వేదం , తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్.. 6.5 కిలోల గంజాయి స్వాధీనం

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

కరీంనగర్, జులై 11 :అంతర్ రాష్ట్ర గంజాయి సరఫరా ముఠాను అరెస్టు చేసినట్లు జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ? గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుండి 6.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఒడిస్సాకు చెందిన ఒకరిని, ఏపీకి చెందిన వ్యక్తితో పాటు ధర్మపురికి చెందిన మరొకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి 3 సెల్ ఫోన్లు, రూ.3500 నగదును స్వాధీనం చేసుకున్నమన్నారు. మీడియా సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# శ్రీశైలం ఆలయాన్ని దర్శించుకున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి

అమరావతి, జులై 11 :: ఏపీలోని రాజమండ్రి శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి గురువారం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి వచ్చిన చౌదరి దంపతులకు ప్రధాన ఆలయ గోపురం వద్దకు ఏఈవో శ్రీనివాసరావు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం వారు భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దంపతులకు వేద ఆశీర్వచనం చేసి, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

# నూతి శ్రీకాంత్ గౌడ్‌కి ఓబీసీ నేతల ఘనసన్మానం



ఖమ్మం, జులై 11 :(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గా భాధ్యతలు స్వీకరించిన నూతి శ్రీకాంత్ గౌడ్ ను ఓబీసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, ఓబీసీ నగర అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ లు మర్యాద పూర్వకంగా కలిసి హార్థిక శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించి సన్మానించారు. బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఓబిసి తరపున ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా అన్నదానం



కరీంనగర్, జులై 11 : (నేటినిజం ప్రతినిధి) బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా గురువారం రోజున కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద బిజెపి నాయకులు,కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని , కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జరుగుతున్న జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు భాన సత్యనారాయణ రావు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ , జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, వాణిజ్య సెల్ అధ్యక్షులు పసుపులేటి శివానందం, కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, దురిశెట్టి అనుప్, తాళ్లపల్లి హరికుమార్ గౌడ్, కైలాస నవీన్, సురేష్ , అల్లంకి సంతోష్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతి శ్రీకాంత్ పదవీ బాధ్యతలు



హైదరాబాద్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):తెలంగాణా బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా నూతి శ్రీకాంత్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

మాసబ్ ట్యాంక్ లోని సంక్షేమ భవన్ లో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల ఽ పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,రవాణాఽబీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ఎస్సి,ఎస్టి, బీసీ మరియు మైనార్టీ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు షబ్బీర్ అలీ , టిపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ మరియు కుటుంబ సభ్యుల సమక్షంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రులు శ్రీకాంత్ ను అభినందించారు.

# గంజాయి నుండి యువతను కాపాడుకుందాం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




హన్మకొండ, జులై 11 : (నేటినిజం ప్రతినిధి)వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులతో కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా ట్రై సిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు, వినియోగం జరిగే ప్రాంతాల వివరాలను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకోవడంతో పాటు ఇప్పటి వరంగల్ గంజాయికి సంబంధించి నమోదయిన కేసులు, పట్టుబడిన స్మగ్లర్లు, గంజాయి వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ల వారిగా అడిగి తెలుసుకోవడంతో పాటు గంజాయి కట్టడికై తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా వలన భవిష్యత్తులో యువత ప్రమాదంలో పడుతుందని, మత్తు పదార్థాల బారిన పడి ఎంతోమంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని. యువత జల్సా జీవితంతో పాటు సులభంగా డబ్బు సంపాదన కోసం అక్రమ మార్గంలో గంజాయి రవాణాకు పాల్పడుతున్నారని. ఇలాంటి యువత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయితో ఇతర మత్తు పదార్థాలను గతంలో విక్రయాలు, రవాణా కు పాల్పడిన నేరస్తులతో పాటు, మత్తు పదార్థాలను వినియోగించే వ్యక్తుల సమాచారాన్ని సేకరించడంతో వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని. గంజాయి నియంత్రణ కై నార్కోటిక్ విభాగం అధికారుల సహకారం తీసుకోవాలని. మనందరం సమన్వంతో పనిచేస్తూ భవిష్యత్తులో వరంగల్ కమిషనరేట్ ను గంజాయి రహిత కమిషనరేట్ గా మారుద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీ లు జితేందర్ రెడ్డి, మధుసూదన్, సైదులు, దేవేందర్ రెడ్డి, తిరుపతి, భీమ్ శర్మ,, తిరుమల్ దేవిడ్ రాజుతో పాటు ఇన్స్ స్పెక్టర్లు, ఎస్.ఐ లు, నార్కోటిక్, సిసిఆర్బి, అధికారులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌లో ఇదీ పరిస్థితి.. మద్యం తాగి స్కూళ్లకు వస్తున్న ప్రభుత్వ టీచర్లు

భోపాల్, జులై 11 : ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి రోజూ మద్యం సేవించి వస్తున్నారు. స్కూళ్లలో మత్తులో జోగుతున్నారు. రెండు మూడు గంటలు ఉండి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు చదువు సాగడం లేదు.

బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ దుస్థితి నెలకొన్నది. గిరిజనులు అధికంగా ఉండే దిండోరి జిల్లాలోని మెహద్వానీ బ్లాక్‌లో ప్రతి రోజూ 15 మందికిపైగా ఉపాధ్యాయులు మద్యం తాగి ప్రభుత్వ స్కూళ్లకు హాజరవుతున్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా మత్తులో జోగుతున్నారు. రెండు, మూడు గంటల తర్వాత స్కూల్స్ నుంచి వెళ్లిపోతున్నారు. దీంతో తమ చదువులు సాగడంలేదని విద్యార్థులు వాపోతున్నారు.

కాగా, జిల్లాలోని ప్రభుత్వ స్కూల్స్ టీచర్ల ప్రవర్తనపై బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (బీఈవో) ఒక రిపోర్ట్‌ను తయారు చేశారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో 15 మంది ఉపాధ్యాయులు తరచూ మద్యం మత్తులో క్లాస్‌లకు హాజరవుతున్నారని ఆరోపించారు. కొంత మంది టీచర్ల పేర్లు కూడా పేర్కొన్నారు.

వీరి వల్ల గిరిజన ప్రభుత్వ స్కూళ్లలో విద్యా వ్యవస్థ గాడి తప్పిందన్నారు.

మద్యం సేవించి స్కూళ్లకు వచ్చే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

# పద్మశాలి సంఘం గ్రేటర్ యువజన అధ్యక్షుడిగా చిన్ని రాకేశ్ నేత



హైదరాబాద్ జూలై 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ ):తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ యువజన అధ్యక్షులుగా చిన్ని రాకేష్ నేత ఎన్నికయ్యారు.. గురువారం హైదరాబాద్ నారాయణగూడ రాజ్ మొహల్లా లో తెలంగాణ ప్రాంత పద్మశాలి రాష్ట్ర ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, కమర్తపు మురళి, మాచర్ల రామచంద్రరావు, ఏబీపీఎస్ ,జాతీయ రాజకీయ అధ్యక్షులు బొల్ల శివ శంకర్, జాతీయ యువజన విభాగం అధ్యక్షులు అవ్వారి భాస్కర్, చేతుల మీదుగా గ్రేటర్ హైదరాబాద్ యువజన విభాగం అధ్యక్షుడిగా చిన్ని రాకేష్ నేత ఎన్నికైనట్లు నియామక పత్రాన్ని అందజేశారు.

రాకేష్ స్కూల్ ప్రారంభం నుండి స్టూడెంట్ యూనియన్ నేతగా విద్యార్థుల సమస్యల కోసం పోరాడి యువజన నేతగా మంచి గుర్తింపు పొందారు రాజకీయ యువజన విభాగం లో పార్టీల అభివృద్ధికి పాటుపడి యువ నేతగా నియోజకవర్గ ప్రజల గుర్తింపు పొంది కార్వాన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానులు పొందారు. సందర్భంగా చిన్ని రాకేష్ నేత మాట్లాడుతూ పద్మశాలి సమాజానికి చేస్తున్న సేవలను గుర్తింపు గా తనకు గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి యువజన అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు స్వామి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కమర్తపు మురళి మాచర్ల రామచంద్రరావు, అఖిలభారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్యక్షులు బొల్ల శివశంకర్, అఖిలభారత జాతీయ యువజన విభాగం అధ్యక్షులు అవ్వారి భాస్కర్, రాష్ట్ర మీడియా విభాగ అధ్యక్షులు బొమ్మ అమరేందర్, అఖిలభారత పద్మశాలి సంఘం మీడియా విభాగం కన్వీనర్ మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నన్ను నమ్మి ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని పద్మశాలి సంక్షేమానికి పాటుపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి గుర్రం శ్రవణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపోల్ జ్ఞానేశ్వర్, కొక్కుల దేవేందర్, పెద్ది జగదీష్‌లు తదితరులు పాల్గొన్నారు

# గత పదేళ్లలో చరిత్రాత్మకంగా 81% పెరిగిన నూతన ఉపాధి కల్పన

న్యూఢిల్లీ, జులై 11 :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కెవిఐసి) 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి, అమ్మకాలు, ఉపాధి కల్పనలో సరికొత్త రికార్డును నెలకొల్పింది.

కవిఐసి ఛైర్మన్ శ్రీ మనోజ్ కుమార్, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక గణాంకాలను విడుదల చేశారు. పాత రికార్డులన్నింటినీ తిరగరాస్తూ, ఉత్పత్తుల అమ్మకాల్లో 399.69 శాతం (దాదాపు 400%), ఉత్పత్తిలో 314.79 శాతం (దాదాపు 315%), కొత్త ఉపాధి కల్పనలో 80.96 శాతం (దాదాపు 81%) పెరుగుదల నమోదైందని ఆయన తెలిపారు. 2013-14తో పోలిస్తే 2022-23 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు 332.14 శాతం, ఉత్పత్తిలో 267.52 శాతం, నూతన ఉపాధి కల్పనలో 69.75 శాతం వృద్ధి నమోదైందని గణాంకాలను వెల్లడించారు.

2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారతదేశం' అనే స్వప్నాన్ని సాకారం చేసేందుకు, భారత్ ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి కెవిఐసి అద్భుతమైన పనితీరును ప్రదర్శిస్తూ, గణనీయమైన సహకారాన్ని అందించిందని శ్రీ కుమార్ అన్నారు. కేవీఐసీ స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తుల అమ్మకాలు రూ.1.55 లక్షల కోట్లు దాటాయని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు రూ.1.34 లక్షల కోట్లుగా ఉన్నాయి. మోదీ ప్రభుత్వ హయాంలో గత పదేళ్లలో గ్రామీణ చేతివృత్తుల వారు తయారు చేసిన స్వదేశీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలు పరిశీలిస్తే, 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.31,154.20 కోట్లు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.1,55,673.12 కోట్లకు పెరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, కెవిఐసి గ్రామీణ ప్రాంతాల్లో 10.17 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించి, గ్రామీణ భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది.

ఈ చారిత్రాత్మక విజయానికి గాంధీజీ స్ఫూర్తి, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ హామీ, దేశంలోని మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న కోట్లాది మంది కళాకారుల అవిశ్రాంత కృషే కారణమని కేవీఐసీ ఛైర్మన్ పేర్కొన్నారు. ఖాదీ ఉత్పత్తులు ప్రతి ఒక్కరు వినియోగించేలా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ బలపరచడం ద్వారా ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని ఆయన అన్నారు. ఖాదీ యువతకు ఫ్యాషన్‌లో 'కొత్త స్టేటస్ సింబల్'గా మారిందన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ వేగంగా పెరుగుతోంది, ఇది ఉత్పత్తి, అమ్మకాలు, ఉపాధి గణాంకాలలో ప్రతిబింబిస్తోంది. గత పదేళ్లలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తిని పెంచేందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో గణనీయమైన మార్పులు, నిర్ణయాలు తీసుకున్నామని, ఇవి సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని ఆయన అన్నారు. మేకిన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్, స్వదేశీ ఉత్పత్తులపై దేశ ప్రజలకు నమ్మకం పెరిగిందనడానికి ఈ గణాంకాలే నిదర్శనమన్నారు.

2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.26,109.08 కోట్లుగా ఉన్న ఖాదీ, గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తుల ఉత్పత్తి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 314.79 శాతం పెరిగి రూ.108,297.68 కోట్లకు చేరుకుంది. నిరంతరం పెరుగుతున్న ఉత్పత్తి ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ గ్రామీణ ప్రాంతాలలో చారిత్రాత్మక కృషి చేసిందని తెలిపేందుకు బలమైన సాక్ష్యమని ఆయన అన్నారు.

గత 10 ఆర్థిక సంవత్సరాల్లో, ఖాదీ, గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తులు ప్రతి ఏడాది అమ్మకాలలో రికార్డులను నెలకొల్పాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు రూ.31,154.20 కోట్లు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి అవి రూ.1,55,673.12 కోట్లకు చేరుకున్నాయి.

గత పదేళ్లలో ఖాదీ వస్త్రాల ఉత్పత్తి అనూహ్యంగా పెరిగింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఖాదీ వస్త్రాల ఉత్పత్తి రూ.811.08 కోట్లు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 295.28 శాతం పెరుగుదలతో రూ.3,206 కోట్లకు చేరుకుని అత్యుత్తమ రికార్డును నెలకొల్పింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఖాదీ వస్త్రాల ఉత్పత్తి రూ.2915.83 కోట్లుగా ఉంది.

గత పది ఆర్థిక సంవత్సరాల్లో ఖాదీ వస్త్రాలకు డిమాండ్ కూడా వేగంగా పెరిగింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో దీని అమ్మకాలు కేవలం రూ.1,081.04 కోట్లు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 500.90 శాతం పెరుగుదలతో రూ.6,496 కోట్లకు చేరుకున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.5,942.93 కోట్ల విలువైన ఖాదీ వస్త్రాలను విక్రయించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వివిధ మాధ్యమాలు, పెద్ద సమావేశాలలో ఖాదీని ప్రోత్సహించడం ద్వారా, ఖాదీ వస్త్రాల అమ్మకాలపై విస్తృత ప్రభావం చూపింది. గత ఏడాది దేశంలో జరిగిన జీ-20 సదస్సులో ప్రధాని ఖాదీని ప్రోత్సహించిన తీరు ప్రపంచ సమాజాన్ని ఖాదీ వైపు ఆకర్షించింది.

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లో గరిష్టంగా ఉపాధి అవకాశాలు కల్పించడం. గత పదేళ్లలో కేవీఐసీ కూడా ఈ రంగంలో రికార్డు సృష్టించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఉపాధి 1.30 కోట్లు కాగా, 2023-24 నాటికి 43.65 శాతం పెరుగుదలతో 1.87 కోట్లకు చేరుకుంది. అదేవిధంగా 2013-14 ఆర్థిక సంవత్సరంలో 5.62 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 80.96 శాతం పెరుగుదలతో 10.17 లక్షలకు చేరుకున్నాయి. ఖాదీ వస్త్రాల తయారీలో 4.98 లక్షల మంది గ్రామీణ ఖాదీ కళాకారులు (స్పిన్నర్లు, నేత కార్మికులు) పనిచేస్తున్నారు.

ఢిల్లీలోని ఖాదీ, గ్రామోద్యోగ్ భవన్ వ్యాపారం కూడా గత పదేళ్లలో అనూహ్యమైన వృద్ధిని సాధించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఇక్కడ వ్యాపారం రూ.51.13 కోట్లు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో అది 87.23 శాతం పెరిగి రూ.95.74 కోట్లకు చేరుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో న్యూఢిల్లీలోని ఖాదీ గ్రామోద్యోగ్ భవన్ వ్యాపారం రూ.83.13 కోట్లుగా ఉంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com